ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 24 మే 2024 5



ఓట్ల లెక్కింపు సాగుతుందిలా..

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీ ఓట్ల లెక్కింపు పోలింగ్ స్టేషన్ల సంఖ్యను బట్టి రౌండ్లుగా విభజించారు. ప్రతి రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాల పరి ధిలో పోలైన ఓట్లను లెక్కిస్తారు. అసెంబ్లీ, పార్లమెంటరీ పరిధిలోని ఓట్లను ఒకేసారి సమాంతరంగా లెక్కిస్తారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కేవలం 13 రౌండ్లలో లెక్కిస్తారు. రాజమండ్రి రూరల్ ఓట్లను 20 రౌండ్లలో లెక్కిస్తారు. అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 228 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ 16 రౌండ్లలో 14 పీఎస్‌ల వంతున లెక్కించి, మిగిలిన 4 పోలింగ్ స్టేషన్ల లో ఓట్లను 17వ రౌండ్‌లో లెక్కిస్తారు. రాజానగరంలో 216 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిని 16 రౌండ్లలో లెక్కిస్తారు. 15 రౌండ్లలో 14 పోలింగ్ స్టేషన్ల వంతున ,మిగిలిన ఆరు పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను 16వ రౌండ్‌లో లెక్కిస్తారు. రాజమండ్రి సిటీలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. మొదట 16 రౌండ్లలో ఒక్కో రౌండుకు 14 పీఎస్‌ల వంతున లెక్కిం చగా.. మిగిలిన 13 పీఎస్‌లను 17వ రౌండ్‌లో లెక్కి స్తారు. రాజమండ్రి రూరల్‌లో 267 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 20 రౌండ్లలో ఓట్లు లెక్కిస్తారు. మొదట 19 రౌండ్లలో ఒక్కో రౌండ్‌కు 14 పిఎస్‌ల వం తున లెక్కించగా మిగిలిన ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓట్లను 20వ రౌండ్‌లో లెక్కిస్తారు. కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 13 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. మొదట 12 రౌండ్లలో ఒక్కో రౌండ్‌కు 14 పోలింగ్ స్టేషన్ల వంతున లెక్కించి, మిగి లిన 8 పీఎస్‌ల పరిధిలోని ఓట్లను 13వ రౌండ్‌లో లెక్కి స్తారు. నిడదవోలులో 205 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 15 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. మొదట రౌండ్లలో ఒక్కో రౌండ్‌కు 14 పీఎస్‌ల వంతుల లెక్కించి, మిగిలిన 9 పీఎస్‌ల పరిధిలోని ఓట్లను 15వ రౌండ్‌లో లెక్కి స్తారు. గోపాలపురంలో 248 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. మొదట 17 రౌండ్లలో ఒక్కో రౌండుకు 14 పీఎస్‌ల వంతున లెక్కించి, మిగి లిన 10 పీఎస్‌ల పరిధిలోని ఓట్లను 18వ రౌండ్‌లో లెక్కిస్తారు.

ముందే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు..

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గానికి పోలైన ఓట్లను ప్రత్యేకంగా, అసెంబ్లీ పరిధిలో పోస్టల్ బ్యాలెట్లను అసెంబ్లీల వారీ లెక్కిస్తారు. పార్లమెంట్ పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు అర్హత ఉన్నవాటిని 500 ఓట్ల వంతున ఒక కట్టగా కడతారు. నన్నయ్య వర్శిటీలో ప్రత్యేకంగా కేటాయించిన కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్ల ఏర్పాటు చేసి, పార్లమెంట్ సభ్యులకు పోలైన ఓట్లను ముందుగా లెక్కిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్‌ను ఆయా కౌంటింగ్ సెంటర్లలో చేపడతారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు..తర్వాత ఈవీఎం ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్ ప్రక్రియలో ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో ఎన్నికల అబ్జర్వర్ ఉంటారు. ఒక ఏఆర్వో, 18 మంది సూపర్‌వైజర్లు, 18 మంది సహాయకులు, 18 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. వివిధ పార్టీల ఎన్నికల ఏజెంట్లు కూడా ఉంటారు. అసెంబ్లీ ఈవీఎంలతోపాటు ఏకకాలంలో పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు వెలువడిన సమయంలోనే రాజమహేంద్రవరం పార్లమెంట్ ఫలితం ప్రకటి స్తారు. అలాగే ప్రతి రౌండ్ ఎన్నికల ఫలితాన్ని ఎన్నికల అబ్జర్వర్లు అధికారికంగా ప్రకటించనున్నారు. ఎన్నికల అబ్జర్వర్లు ఫలితాల కాగితంపై సంతకం పెట్టిన తర్వాత మాత్రమే ప్రకటిస్తారు.

ఆరోగ్య శ్రీ సేవలపై గందరగోళం

- కొన్ని ఆసుపత్రుల్లో సేవలు ప్రారంభం
- పట్టుబడుతున్న మరికొన్ని ఆసుపత్రులు
- ఆరోగ్యశ్రీ వర్తించదంటున్న యాజమాన్యాలు
- అయోమయంలో రోగులు

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 : జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలిచిపోవడంతో వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చే రోగులు తీవ్రమైన గందరగోళానికి గురవుతున్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల వారు చాలా తెలివిగా .. బిల్లుల కోసం ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాం అని చెప్పకుండా ఈ రోగానికి ఆరోగ్యశ్రీ వర్తించదు అని చెప్పి పంపుతున్నట్టు తెలిసింది. పెండింగ్‌లో ఉన్న బిల్లు బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. కానీ రోగులకు, వారి కుటుంబీకులు చాలా మందికి ఈ కబురు ఆసుపత్రికి వచ్చిన తర్వాత కానీ తెలియకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ఇదిలా ఉంటే జిల్లాలోని 36 ప్రైవేట్ ఆసుపత్రులకు మెజార్టీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు గురువారం సాయంత్రం నుంచి నెమ్మదిగా ప్రారంభించినట్టు తెలిసింది. వీరికి బిల్లు బకాయిలు కొంతమేర చెల్లించడంతో ఆరోగ్యశ్రీ కేసులు తీసుకుంటున్నట్టు తెలిసింది. కానీ ప్రధానమైన ఆర్థోపెడిక్, కార్డియాలజీ వంటి ఐదు, ఆరు ఆసుపత్రులు మాత్రం తమకు బిల్లు బకాయిలు భారీగా ఉన్నందున వాటిని చెల్లిస్తేనే కానీ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు అందించలేమని అధికారులకు స్పష్టం చేసినట్టు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల నుంచి హెచ్చరికలు వచ్చినా తాము ఆరోగ్యశ్రీ సేవలు తిరిగి ప్రారంభించేది లేదని మంకుపట్టు పట్టినట్టు తెలిసింది. వీళ్లను గురువారం రాత్రికి ఒక కొలిక్కి తీసుకొచ్చి సమస్య పరిష్కరించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.అదే జరిగితే శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు జిల్లాలో పూర్తిగా ప్రారంభించే అవకాశం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి.

నిలిచిన ఈ -ప్రగతి సేవలు?

ఆర్‌టీవో కార్యాలయంలో ఆగిన సర్వీసులు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ప్రగతి సాఫ్ట్‌వేర్ నిర్వాహకులకు మధ్య విభేదాల వల్ల ఆర్‌టీవో కార్యాలయంలో సిటిజన్ సర్వీసులు అందించే ఈ ప్రగతి సేవలు ఆగిపోయాయి. ఈ సేవలు బుధవారం ఆగిపోవడంతో ఆర్‌టీవో కార్యాలయాల చుట్టూ వినియోగదారులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వాహనాల ఫిట్‌నెస్ సేవల నుంచి రిజిస్ట్రేషన్లు , లైసెన్సులు వంటి సేవలన్నీ నిలిచిపోయాయి. వాస్తవానికి కొంతకాలం కిందటే ఈ - ప్రగతి సాఫ్ట్‌వేర్ ఆగిపోతుందనే ప్రచారం జరిగింది. దీనికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం వాహన్ -సారథి పేరుతో విడిగా సేవలందించే సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. కానీ దీని ప్రోసెస్ కఠినతరం కావడంతో ఎవరు సేవలు పొందడంలేదు. సులభంగా ఉన్న ఈ-ప్రగతి సేవలనే వినియోగిస్తున్నారు. కాని ఆకస్మికంగా ఈప్రగతి సర్వీసులు ఆగిపోవడంతో ఆర్‌టీ వో కార్యాలయ సేవలన్నీ నిలిచిపోయాయి. స్కూల్ తెరిచే సమయం ఇది కావడంతో బస్సుల ఫిట్‌నెస్ అవసరమైనా ఈ సర్వీసు కూడా ఆగిపోయింది. అధికారులు దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోతున్నారు.



ప్రజా తీర్పునకు మిగిలింది 11 రోజులే

- జూన్ 4న కౌంటింగ్
- ఉదయం 5 గంటలకే ఆరంభం
- మధ్యాహ్నం 12 తర్వాత ఫలితం వెల్లడి
- తొలి ఫలితం కొవ్వూరుదే
- చివరి ఫలితం రాజమండ్రి రూరల్
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు షురూ

రాజమహేంద్రవరం, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఫలితాలు వచ్చేస్తున్నాయి.. ప్రజా తీర్పునకు రోజులు దగ్గరపడుతున్నాయ్.. సరిగ్గా 11 రోజులే గడువుంది.. దీంతో అధికారులు లెక్కింపు ఏర్పాట్లలో మునిగితేలుతుండగా.. అభ్యర్థులు ఇంకా లెక్కల తక్కెడలో ఉన్నారు.. ఎవరికి వారు అంచనాలు వేసుకుంటూ మాదే పైచేయి అని చెప్పుకుంటున్నారు. ఓటరు తీర్పు ఎవరిని వరిస్తుందో మరి 11 రోజుల్లోనే తేలిపోనుంది. జిల్లాలో మొదట కొవ్వూరు.. చివరగా రాజమహేంద్రవరం రూరల్ ఫలితం వెలువడుతుంది.ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లను జూన్ 4వ తేదీన లెక్కించనున్న సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధి ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును నన్నయ వర్శిటీలో నిర్వహిస్తారు. ఈవీఎంలన్నీ కట్టుదిట్టమైన మూడంచెల భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లలో ఉన్నాయి.జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా 1577 పోలింగ్ కేంద్రాల్లో 13,13,630 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 80.93 శాతం. ఓట్ల లెక్కింపునకు రౌండ్‌కు 14 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి రౌండ్‌లోనూ అసెంబ్లీ ఓట్లకు 14 టేబుళ్లు, పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి టేబుల్ వద్ద పర్యవేక్షకుడు, సహాయ పర్యవేక్ష కుడు, ఒక మైక్రో అబ్జర్వరు ఉంటారు. వీరి పర్య వేక్షణలో అభ్యర్థులు లేదా, వారు ప్రతిపాదించిన ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. లెక్కింపు ప్రక్రియ పరిశీలనకు కేంద్ర ఎన్నికల కమిషన్ నలుగురు పరిశీలకులను నియమించింది. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను వీఆర్ ఏల ద్వారా కౌంటింగ్ కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రత మధ్య తరలిస్తారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత తిరిగి వాటిని భద్ర పరుస్తారు. కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ఉద యం 5 గంటల నుంచే ఆరంభమవుతుంది.మొదట పార్లమెంట్ అభ్యర్థికి పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, తర్వాత అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తారు. అనంతరం ఈవీఎం వారీ ఓట్ల లెక్కింపు అరంభిస్తారు. మొదటి రౌండ్‌లో 35 నుంచి 40 నిమిషాల్లో లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేశారు. తర్వాత ప్రతి రౌండ్‌కు 20 నిమిషాలు పడుతుంది.మధ్యలో లెక్కింపు పూర్తయిన ఈవీఎంలను తరలి ంచడం,లెక్కించాల్సినవి తేవడానికి కొంత సమయం పడు తుంది. అభ్యంతరాల్లేక పోతే మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల మధ్య తొలి ఫలితం వచ్చే అవకాశం ఉంది. లెక్కింపునకు అవసర మైన ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం వెలగపూడి నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలతతో సమీక్షించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు పరిశీలన..

దివాన్‌చెరువు, మే 23 : కౌంటింగ్ రోజున నిఘా వ్యవస్థ నన్నయ వర్శిటీని తమ ఆధీనంలోకి తీసుకుంటుందని జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి గురువారం సాయంత్రం నన్నయ వర్శిటీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు, కమాండ్ కం ట్రోల్ రూమ్, మీడియా విభాగం వద్ద నిర్వహించే భద్రత తదితర ఏర్పాట్లను పరిశీలించారు. నోడల్ అధికారులకు సూచనలు చేసి అక్కడ రిజిస్టర్లలో సంతకాలు చేశారు. ముఖ్యమైన ప్రదేశా లను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. నన్నయ వర్శిటీ చుట్టుప్రక్కల పోలీసు విభాగానికి చెందిన 7 సోలార్ సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.లెక్కింపు కేంద్రంలో కంట్రోల్ రూమ్ జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో 24 గంటలు పనిచేస్తుందన్నారు.నన్నయ వర్శిటీ పరిధిలో ఒక కిలోమీటరు వరకూ సెక్షన్ 144 అమలులో ఉంటుందన్నారు. జూన్6 వతేదీ వరకూ జిల్లా మొత్తం కవర్ చేస్తూ 30 పోలీస్ యాక్ట్ ప్రొసీడింగ్స్ జారీ చేశామన్నారు. ఒక అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద బందోబస్తు ఉందని చెప్పారు.

కౌంటింగ్‌కు కార్యాచరణ : కలెక్టర్

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి) : ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా పూర్తి చేయడానికి పోలీస్, జిల్లా ఎన్నికల యంత్రాంగం సంయుక్త కార్యా చరణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాధవీలత తెలిపారు.స్థానిక కలెక్టరేట్ నుంచి ఆమె ఎన్నికల ఏర్పాట్లపై ఎస్పీ, రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు,ఫలితాల వెల్లడికి సంయుక్త కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. భద్రత, ముందస్తు చర్యలపై అభ్య ర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిధిలో ఏడు సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీచేసిన అభ్యర్థుల ఇళ్ల వద్ద, రాజకీయ పార్టీల ఆఫీ సుల వద్ద సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి వ్యక్తులు, సమూహాల కదలికలపై దృష్టిపెట్టాలన్నారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రతి కౌంటింగ్ హాల్ వద్ద తప్పకుండా ఒక వీడియో గ్రాఫర్‌ను ఏర్పాటు చేయాల న్నారు.ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్వో జి.నరసింహులు కమిషనర్ కె.దినేష్‌కుమార్ పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ తదితరులు

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని, అసాంఘిక వ్యక్తుల కదలికలు, పాత నేరస్తులపై నిఘా పటిష్టం చేశామని ఎస్పీ జగదీశ్ పేర్కొ న్నారు. ప్రతి రోజూ కార్డన్ అండ్ సెర్చ్ సోదాలు చేస్తున్నా మన్నారు. దీనిలో భాగంగా గురువారం తెల్లవారుజామున అక్రమంగా నిల్వ ఉంచిన 22 మద్యం సీసాలు, 64 నెంబరు, రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే అసాంఘిక వ్యక్తులను ఉపేక్షించేది లేదన్నారు.యువత అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.అనుమానిత వ్యక్తులు, వస్తువులు, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, సారా, ఆయుధాలు వంటి వాటిపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయడం బాధ్యతగా భావించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.డయల్ 100,112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చన్నారు.

ఏమైపోయారు.. వీళ్లంతా!?



మీకు మేమున్నాం.. మీ సమస్యేంటో చెప్పండి క్షణాల్లో పరిష్కరిస్తాం.. ఓటరు వెళ్లి అడిగిందే తడవు.. ఏ పనైనా రోజులో జరిగి పోయేది.. పోలింగ్ ముందు వరకూ ఇదీ సీన్.. మరిప్పుడు.. నాయకులు కనిపించడమే మానేశారు.. పోలింగ్ ముగిసిన నాటి నుంచి నాయకులు బయటకే రావడంలేదు.. కొంత మంది తమ నాయకుడు విదేశాలకు వెళ్లిపోతే.. మరికొంత మంది అదే బాటలో ఉన్నారు.. స్థానికంగా ఉన్న వారు సైతం ఇళ్లకే పరిమితమవుతున్నారు.. నాయకులు ప్రజలకు అందు బాటులో లేకపోవడంతో.. ఏమైపోయారో వీళ్లంతా అనుకుంటూ.. మా నాయకులు కనిపించడం లేదంటూ.. ప్రకటనలు ఇస్తామంటూ ప్రజలు సెటైర్లు వేసుకుంటున్నారు..

పాలకులు కనబడుట లేదు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వై నాట్ 175 అని ఊదరగొట్టిన వైసీపీ నాయకులు పోలింగ్ అయిన తర్వాత జనాల్లో కనిపించడం లేదు. పంకా అధినేత ఇప్పటికే విదేశాలకు వెళ్లిపోగా.. రెక్కలు తోచిన దిక్కునకు తుర్రుమంటున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటై పాలకులు ప్రమాణ స్వీకారం చేసే వరకూ ప్రస్తుతం పదవుల్లో ఉన్న వాళ్లు ఆపద్ధర్మ(కేర్ టేకర్) పాలకులుగా ఉంటారు. కానీ పోలింగ్ సరళి నిశితంగా గమనించుకున్న వైసీపీ నేతలు మాత్రం పదవులు ఇక లేనట్లే అనే నైరాశ్యంలో మునిగిపోయినట్టు కనిపిస్తు న్నారు. అంతే పోలింగ్ తర్వాత రోజు నుంచి కనిపించడమే మానేశారు. కొంత మందికి ఇంటికే పరిమితమైతే మరి కొంత మంది ఊరు దాటిపోయిన తీరు వారిలో కనిపిస్తోంది. దీంతో వారి క్యాడర్ కూడా అయోమయంలో చిక్కుకుంది. రానున్న రోజులు గడవడంపై దృష్టి సారించాయి. వైసీపీ అభ్యర్థులుగా పోటీలో నిలిచిన వారికి భవిష్యత్ రాజకీయ జీవితం చీకటిగా కనిపిస్తుండడంతో ఎవరికీ అందుబాటులో ఉండడం లేదనే చర్చ నడుస్తోంది.

'ఆపద్ధర్మం' మరిచారా?

ప్రజలు ఎన్నికల ద్వారా ఎన్నుకొన్న ప్రజా ప్రతినిధుల ద్వారా లోక్‌సభ, శాసన సభలు ఏర్పాటవుతాయి. వాటి కాల పరిమితి ముగిసినా లేదా రద్దయినా ఆయా ప్రజా ప్రతినిధులు పదవులను కోల్పోతారు. మళ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతుంది. అలాంటి సమయంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు జరిగే వరకూ ప్రజలకు ఇబ్బందులకు కలుగకుండా కొన్ని పరిమితులకు లోబడి అప్పటి వరకూ పదవుల్లో ఉన్న వారు పాలన సాగిస్తారు. దీనినే ఆపద్ధర్మ(కేర్ టేకర్ గవర్నమెంట్) ప్రభుత్వం అంటారు. రాష్ట్రపతి, గవర్నర్ కోరిక మేరకు ప్రధాని, ముఖ్యమంత్రి ఆపద్ధర్మంగా కొనసాగుతారు. మంత్రులకు కూడా ఇదే వర్తిస్తుంది. ఆపద్ధర్మ ప్రభువులు విధాన నిర్ణయాలు తీసుకోడానికి వీల్లేదు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ నడుచుకోరాదు. బడ్జెట్ తయారీ, ఆర్డినెన్సుల జారీ, ఉన్నతాధికారుల బదిలీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటివి చేయకూ డదు. రోజు వారీ ప్రభుత్వ కార్యకలాపాలను మాత్రమే ఆపద్ధర్మ ప్రభుత్వం నడిపిస్తుంది. కార్యనిర్వాహక బాధ్యతలు నెరవేరుస్తుంది. ఆపద్ధర్మ ప్రభుత్వంలో ఉన్న ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తీర్చవచ్చు. ఒక రకంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే. అయితే ప్రస్తుత ఆపద్ధర్మ పాలకుల్లో గతంలో ఎన్నడూ లేని వింత పరిస్థితి కనిపిస్తోంది. ఐదేళ్లు అయిపోయింది. ఇక ప్రజల సమస్యలు మనకెందుకు అనే తీరుతో వైసీపీ ప్రజాప్రతినిధులు ఎవరి సొంత పనులు వాళ్లు చూసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

ప్రజాప్రతినిధులు కనిపించరే..

పోలింగ్ రోజున హల్‌చల్ చేసిన వైసీపీ అభ్యర్థులు, నాయకులు తర్వాత ప్రజలకు దూరంగా గడుపుతున్నారు. అధినేత దగ్గర నుంచీ కింది స్థాయి కార్యకర్త వరకూ ఇదే ధోరణి అవలంబిస్తున్నారు. మొదటిగా ఆపద్ధర్మ సీఎం జగన్ లండన్‌కి లగ్జరీ విమానంలో వెళ్లిపోయారు. తర్వాత జిల్లాల్లోని నేతలు కూడా అధినేత మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఆయా అభ్యర్థుల కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. రాజమహేంద్రవరం వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ సిట్టింగ్ ఎంపీగా కూడా ఉన్నారు. ప్రతిరోజూ ప్రెస్‌మీట్లతో మునిగితేలేవారు.. అభివృద్ధి అంతా నేనే చేశానంటూ ఏదో ఒక మూల కనిపించేవారు.. సోషల్ మీడియానూ ఖాళీ ఉంచేవారు కాదు. పోలింగ్ ముగిసిన తర్వాత నుంచీ ఆయన ప్రజలకు అందుబాటులో లేరు. రూరల్ వైసీపీ అభ్యర్థి, ఆపద్ధర్మ మంత్రి వేణుగోపాలకృష్ణ రామచంద్రాపురం నుంచి రాజకీయ బదిలీపై ఇక్కడకు వచ్చిన విషయం తెలిసిందే.స్థానికంగా క్యాడర్ లేకపోయినా ఎన్నికల ముందు గత రెండు నెలలుగా ఎక్కడో చోట కొబ్బరికాయ కొడుతూ రోజూ మీడియాలో కనబడుతూ ఉండేవారు. అయినా స్థానికంగా కనబడడం లేదు. కొవ్వూరు వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు దేవరపల్లికి పరిమితమయ్యారు. నిడదవోలు వైసీపీ అభ్యర్థి శ్రీనివాసనాయుడు హైదరాబాద్ చేరుకున్నారు. కొవ్వూరు నుంచి బదిలీపై గోపాలపురం బదిలీపై వెళ్లిన ఆపద్ధర్మ హోంమంత్రి తానేటి వనిత సొంత పార్టీ నేతలతో విసిగిపోయి తీవ్ర ఆవేదనకు గురయ్యారని తెలుస్తోంది. తనకు ఓట్లు పడేలా చేస్తామంటూ డబ్బులు తీసుకొని మోసం చేశారని బాధను వెళ్లగక్కినట్లు చెబుతున్నారు. ఆమె కూడా ఇంటి పట్టున గడుపుతున్నారు. అనపర్తి వైసీపీ అభ్యర్థి సత్తి సూర్య నారాయణ రెడ్డి ఎన్నికల వరకూ మధ్యాహ్నం సమయంలో రోగులను పరీక్షించేవారు. పోలింగ్ తర్వాత సమయాన్ని పూర్తిగా వైద్యానికి కేటాయిస్తున్నారు. రాజానగరం వైసీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా సర్వేలు చేసుకుంటూ సమీక్షలు నిర్వహించుకుంటూ గడుపుతున్నారు. ఇదిలా వైసీపీ నేతల క్యాడర్, సిబ్బంది డీలా పడిపోయారు. సర్వేలు కూటమి వైపు విజయాన్ని చూపుతుండడం, పోలింగ్ సరళి కూడా అదే స్పష్టం చేస్తుండడంతో వైసీపీ ప్రజా ప్రతినిధులు నిస్తేజంగా గడుపుతుండడంతో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉందని క్యాడర్ వాపోతున్నారు.

- జిల్లా అంతటా జగన్మాయ
- పోలింగ్ తర్వాత అంతా మాయం
- జగన్ బాటలోనే కొందరు..
- మరి కొందరు ఇంటికే పరిమితం
- కనిపించని ఆపద్ధర్మ పాలకులు
- వైసీపీ కేడర్‌లో తీవ్ర నైరాశ్యం
- సమస్యలు గాలికొదిలేశారు..
- ప్రజల ఎదురుచూపులు
- నిరుత్సాహంలో మండిపాటు

ప్రజల నిరుత్సాహం

ప్రజా సమస్యలను గాలికొదిలేశారు.. నియోజక వర్గంలో ఎక్కడ సమస్య ఉన్నా పరిష్కరించాల్సిన బాధ్యత నాయకులదే. అయితే ఆ దిశగా నాయకులు ఎవరూ ఆలోచించడంలేదు. ఇదిలా ఉండగా జూన్ 4వ తేదీన కౌంటింగ్ నేపథ్యంలో తిరిగి వచ్చేందుకు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ వారంలో మళ్లీ నాయకులంతా నియోజకవర్గాల బాటపడతారు. ఏంటి సార్ ఇది అని నాయకులను అడిగితే ఏం చేస్తామయ్యా బాబు రెండు నెలలు నిద్రాహారాల్లేకుండా ఎన్నికలకు పనిచేశాం.. ప్రజల సమస్యలు చూస్తే.. మా సమస్యలెవరు చూస్తారని అంటుండం గమనార్హం. అయితే 2019 ఎన్నికల్లో ఓటు వేసి అధికారం కట్టబెట్టిన ప్రజలు మాత్రం పాలకుల కోసం ఎదురుచూస్తున్నారు. నిరుత్సాహంతో ఏ ప్రభుత్వం వచ్చినా మళ్లీ మరో ఐదేళ్లకు తీర్పు ఇచ్చేశాం.. ఇక మాతో పని ఎందుకుంటుంది అని మండిపడుతున్నారు.ఇదిలా ఉండగా ప్రతిపక్ష నాయకులు మాత్రం ప్రతిరోజూ నియోజకవర్గాల్లో తిరుగుతూ సమస్యలేంటో తెలుసుకుంటున్నారు.



సోడాల తయారీ పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనుమతుల్లేకుండా సోడాల తయారీ

పరిశ్రమపై విజిలెన్స్ అధికారుల దాడి

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్‌లోని పిడింగొయ్యిలో ఉన్న బ్లూ వేల్ బేవరేజెస్ సోడా, డ్రింక్స్ తయారీ పరిశ్రమలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు.విజిలెన్స్ ఎస్పీ ఎస్‌వీకేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా సంస్థ యజమాని చెక్క నవ దుర్గా భవానీ నిమ్మ, ద్రాక్ష, ఆరెంజ్, బ్లూబెర్రీ, పైనాపిల్ ఫ్లేవర్స్‌లో సోడా, కూల్‌డ్రింక్స్‌ను తయారు చేస్తున్నారు. సుమారు 10 లీటర్ల కృత్రిమ రంగులు, రుచులు కలిగిన సరుకును స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని ఎస్పీ వివరించారు.

ఉరివేసుకుని యువకుడి మృతి

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉరి వేసుకొని మృతి చెందడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వీరయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్మా కాలనీకి చెందిన జె.వీరబాబు తాపీ పనులు చేస్తుంటాడు. ఏడాది కిందట వివాహం జరిగింది. శుక్రవారం సాయంత్రం క్వారీ మార్కెట్ వద్ద ఉన్న ఓ హోర్డింగ్‌కి ఉరి వేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. వీరబాబు వ్యవసనాలకు బానిసయ్యాడని, ఇంటికి కూడా సరిగా వెళ్లేవాడు కాదని ప్రాథమికంగా గుర్తించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఏసీబీ అరెస్టు చేసిన అధికారికి రిమాండ్

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): అవినీతి అభియోగాలపై ఏసీబీ అరెస్టు చేసిన అధికారికి కోర్టు రిమాండ్ గురువారం విధించింది. కాకినాడ జిల్లా పరిశ్రమల శాఖలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న తమిడి మురళీ(61)ని 22న ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రాజమండ్రి ఏసీబీ స్పెషల్ కోర్టులో ఆయనను ప్రవేశపెట్టగా జూన్ 5 వరకూ కోర్టు రిమాండు విధించిందని ఏసీబీ అధికారుల తెలిపారు.

రేపు ఏపీపీఎస్సీ పరీక్ష

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ పరీక్ష శనివారం జరుగుతుందని..అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకూ మాత్రమే అభ్యర్థులను అనుమతిస్తారన్నారు. జిల్లాలో మొత్తం 960 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉందన్నారు. లూథర్‌గిరి లోని రాజీవ్ గాంధీ కళాశాలలోని ఆయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష నిర్వహిస్తారన్నారు.

వైభవంగా చక్రస్నానం



చక్రస్నాన మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 23: కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవంగా పూజలందుకుంటున్న అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా గురువారం పంపా సరోవరం వద్ద చక్రస్నానం కార్యక్రమం వేడుకగా జరిగింది. ఉదయం 9 గంటలకు నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను, పెండ్లిపెద్దలైన సీతారాములను మేళతాళాలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ పంపాతీరం వద్ద నున్న ప్రత్యేక వేదిక వద్దకు తీసుకుని వచ్చారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంపా సరోవరంలో కృత్రిమంగా తీర్చిదిద్దిన కోనేరు వద్దకు తీసుకుని వచ్చి స్వామి,అమ్మవార్లను, త్రిశూలం, సుదర్శన చక్రంతో ముమ్మారు స్నానమాచరింపచేశారు. తిరిగి వేదిక వద్దకు తీసుకెళ్లి పూజలనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా కంకణ విమోచన గావించారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ ఐ.వి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



నవదంపతులను ఎత్తుకుని నృత్యం..

ఉల్లాసంగా నాకబలి, దండియాడింపు

సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు ఉల్లాసంగా జరిగాయి. అమ్మవారికి నల్లపూసలు గుచ్చి వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ముందుకు సాగారు. అర్చకస్వాములు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఎత్తుకుని నృత్యం చేశారు. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీపుష్పయాగం

సత్యదేవుడికి క్రోధి నామసంవత్సర దివ్య కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రికి జరిగే శ్రీపుష్పయాగంతో ముగియనున్నాయి. రాత్రి 7 గంటలకు స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఈ వేడుకను నిర్వహిస్తారు. వివిధ సుగంధ భరిత పుష్పాలతో నవ దంపతులను అర్చించి విశేష పదార్థాలను నివేదిస్తారు. అనంతరం దంపతీ తాంబూలాలు అందించి మహిళలకు రవిక వస్త్రాలు బహూకరిస్తారు.



ప్రత్యేక వేదికపై పూజలు నిర్వహిస్తున్న పండితులు

సాగర తీరాన విశేష పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సర్పవరం జంక్షన్, మే 23: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు గత ఏడు రోజులుగా వేలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం స్వామివారి చక్రస్నానం ఘట్టంలో భాగంగా ఆలయ పండితులు మంత్రోచ్ఛరణలతో పూర్తి శాస్త్రోక్తంగా పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. విశేషాలంకరణలో దర్శనమిచ్చిన శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి విగ్రహం, చక్ర పెరుమాళ్లను చినశేషవాహనంపై ఉంచారు. వేలాది మంది భక్తులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్పవరం నుంచి ఊరేగింపుగా తోడ్కొని సూర్యారావుపేట సాగర తీరానికి తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు, చక్ర పెరుమాళ్లకు పూజలు, అభిషేకాలు, అర్చనలు, నీరాజనాలు, పలు రకాల విశేష ద్రవ్యాలతో పూజలు చేశారు. భక్తుల గోవింద నామ స్మరణతో అత్యంత భక్తశ్రద్ధలతో సముద్రంలో స్నానం ఆచరించిన అనంతరం స్వామివారి చక్రస్నానంలో పాల్గొన్నారు. బీచ్‌లో పాల్గొన్న భక్తులకు దాతల ఆధ్వర్యంలో పులిహోర, చక్రపొంగలితో పాటు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా టెంట్‌లో వసతి కల్పించడం పట్ల మహిళా భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం పుష్ప వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కృష్ణబాబు మృతికి ప్రముఖుల సంతాపం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రఘురామకృష్ణంరాజు

కొవ్వూరు, మే 23 : కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)లతో పాటు కుమారుడు రవిబాబు, అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రఘురామకృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు కృష్ణబాబుకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో జైలు

కాకినాడ క్రైం మే 23 చిట్స్ పాటలకు సంబంధించి చిట్ కట్టించుకుని తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసగించిన ఇద్దరి నిందితులపై నేరం రుజువు కావడంతో కాకినాడ రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన పైలా నాగేశ్వరరావు, పైలా పవన్‌కుమార్ కలిసి కాకినాడ అపోలో ఆసుపత్రి సమీపంలో దుర్గా, రాధిక చిట్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థను నడిపేవారు. ఈ క్రమంలో స్థానిక జగన్నాథపురానికి చెందిన కాలే సత్య వీరలక్ష్మి అనే మహిళతో 2016 లో చిట్ వాయిదాల రూపంలో రూ. 10 లక్షలు కట్టించుకున్నారు. అన్ని వాయిదాలు కట్టించుకున్న అనంతరం సత్య వీరలక్ష్మికి డబ్బు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తప్పించుకుని తిరగడంతో ఆమె మోసపోయానని గ్రహించింది. అనంతరం బాధితురాలు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి నిందితులిరువురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టులో జరిగిన వాదోపవాదనల్లో నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోసాల కమలకుమారి వాదనలు వినిపించారు.

పోలీసులు హద్దులు మీరితే..ఫిర్యాదు చేయండి

పైసా ఖర్చులేదు.. 6 నెలల్లో పరిష్కారం

పోలీసు కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్ విశ్వనాథం



మీడియాతో మాట్లాడుతున్న అథారిటీ చైర్మన్ విశ్వనాథం

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): పోలీసులు విధులు దుర్వినియోగం చేసిన సందర్భాల్లో వారిపై పోలీసు కంప్లైంట్స్ అథారిటీకి బాధితులు లేదా వారి సంబంధీకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని అథారిటీ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఆర్‌జే విశ్వనాథం చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని అథారిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. కాకినాడ, తూర్పుగోదావరి, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని కానిస్టేబుళ్ల దగ్గర నుంచి డీఎస్పీ స్థాయి వరకూ వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపట్టే అధికారం రాజమహేంద్రవరం కేంద్రంగా పనిచేస్తున్న అథారిటీకి ఉందన్నారు. గుంటూరులో ఉన్న రాష్ట్రస్థాయి అథారిటీకి ఎస్పీ నుంచి డీజీ వరకూ అధికార పరిధి ఉందన్నారు. తమ పరిధిలోని ఏదైనా జిల్లాకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తే అక్కడికే వెళ్లి విచారణ చేపడతామని చెప్పారు. ఫిర్యాదుదారులు dpcarajamahendravaram@gmail.com మెయిల్ ద్వారా లేదా 99484 64363 నెంబరుకు వాట్సాప్ ద్వారా లేదా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, వైటీసీ, బొమ్మూరు, రాజమహేంద్రవరం రూరల్‌కు రిజిస్టరు పోస్టు ద్వారా తమ అర్జీలను పంపించవచ్చని తెలిపారు. తమ కార్యాలయానికి వచ్చి నేరుగా సమస్యను తెలిపి ఫిర్యాదు అందజేయవచ్చన్నారు. కస్టడీలో మరణించడం, అత్యాచారం, కస్టడీలో తీవ్ర గాయాలు కావడం, భూ కబ్జాలు, సివిల్ తగాదాల్లో కల్పించుకోవడం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి వ్యక్తులను ఇబ్బంది పెట్టడం వంటి వాటిపై ఘటన జరిగిన రోజు నుంచి ఏడాది లోపుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గరిష్టంగా ఆరు నెలలలోపుగా విచారణ పూర్తి చేసి సదరు ఉద్యోగి విధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని రుజువైతే చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. పోలీసులపై ఫిర్యాదు చేస్తే వారితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయం అవసరం లేదన్నారు. అథారిటీ ఏర్పాటైన తర్వాత 14 ఫిర్యాదులపై విచారణ జరిపి 10 కేసులకు పరిష్కారం చూపించామన్నారు. 4 కేసుల విచారణ వివిధ దశల్లో ఉందన్నారు. అథారిటీపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అథారిటీ సభ్యులు విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం.జితేంద్ర, విశ్రాంత అడిషనల్ ఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాది సీహెచ్ మన్మథరావు పాల్గొన్నారు.

ముగిసిన ఇంజనీరింగ్ పరీక్షలు

జేఎన్టీయూకే, మే 23: ఏపీఈఏపీసెట్-2024 ఆన్‌లైన్ ఇంజనీరింగ్ విభాగం ప్రవేశ పరీక్షలు గురువారం ఉదయం సెషన్‌తో ప్రశాంతంగా ముగిసినట్లు సెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. కాకినాడ జిల్లాలోని 5పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 930 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 895 మంది హాజరయ్యారని 35 మంది గైర్హాజరు కాగా మొత్తం 96.24 శాతం హాజరు నమోదైందన్నారు. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో 697 మంది, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో 340 మంది హాజరయ్యారన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించిన పరీక్ష ప్రాథమిక కీ ని వీసీ విడుదల చేశారు. రెస్పాన్స్ షీట్స్‌ను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల వరకూ ప్రాథమిక కీ పై విద్యార్థులకు అభ్యంతరాలుంటే తెలియచేయవచ్చన్నారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షల ప్రాథమిక కీ ని శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల వరకూ ప్రాథమిక కీ పై విద్యార్థులకు అభ్యంతరాలుంటే తెలియచేయవచ్చని కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అంతే కాకుండా ఏపీఈఏపీసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి 25 శాతం వెయిటేజీ మార్కులను ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా తీసుకోనున్న నేపథ్యంలో ఏపీ రెగ్యులర్ ఇంటర్ విద్యార్థులు కాకుండా ఇతర బోర్డులకు చెందిన 10+2 విద్యార్థులు తమ మార్కులను ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వాటి ద్వారా వారికి ర్యాంకులు కేటాయించనున్నట్లు కన్వీనర్ సూచించారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలున్నా 0884 2359599, 2342499 ఫోన్ నెంబర్లలో గానీ, helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా గానీ సంప్రదించాలన్నారు.

హత్యాయత్నం కేసులో జైలు

కాకినాడ క్రైం మే 23 కానిస్టేబుల్ పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో కాకినాడ రెండో అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్.విజయబాబు మూడు సంవత్సరాల మూడు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ కొండయ్యపాలెంలో 2020లో ఏఆర్ కానిస్టేబుల్ రాములకొండ బాలరెడ్డిని ఆ ప్రాంతానికి చెందిన వీధి సుబ్రహ్మణ్యం, సవలం పవన్‌కుమార్, యానం సత్యభవాని శంకర్‌లు కలిసి చాకుతో పొడిచారు. అనంతరం బాలరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో జరిగిన వాదోపవాదనల అనంతరం నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అయితే నిందితుల్లో వీధి సుబ్రహ్మణ్యం ఇప్పటికే హత్యకు గురి కావడంతో పవన్‌కుమార్, భవాని శంకర్‌లకు న్యాయమూర్తి శిక్షను ఖరారు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డేనియల్ దినకర్ జేసన్ వాదనలు వినిపించారు.

సాదాసీదాగా జడ్పీ సమావేశం



జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరుగుతున్న సమావేశం



హాజరైన జడ్పీటీసీ సభ్యులు

కాకినాడ సిటీ, మే 23 : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలకు లోబడి ఏ విధమైన శాఖాపర సమీక్షలు, తీర్మానాలు చేయకుండా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. గురువారం కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జడ్పీ సర్వసభ్య సమావేశం, 1,2,4,7 స్థాయీ సంఘ సమావేశాలకు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు. అదే విధంగా 3వ స్థాయీ సంఘ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఐదో స్థాయీ సంఘ సమావేశానికి స్థాయీ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, 6వ స్థాయీ సంఘ సమావేశానికి జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో జీఎస్ రాంగోపాల్, జడ్పీటీసీ సభ్యులు, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

రౌతులపూడి, మే 23: కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామశివారున బుధవారం ఏలేరు కాలువలో పడి గల్లంతైన వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం... గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన సికోలు వీరబాబు బుధవారం రౌతులపూడిలో ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఏలేరు కాలువలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. గురువారం మధ్యాహ్నం వీరబాబు మృతదేహాన్ని గుర్తించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



వరుపుల కారు ఢీకొనడంతో దెబ్బతిన్న మరో వాహనం

పిఠాపురం బైపాస్ రోడ్డులో రెండు కార్లు ఢీ

ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు స్వల్పగాయాలు

పిఠాపురం/ప్రత్తిపాడు, మే 23: కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుతో పాటు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. రెండు కార్లల్లో బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తొండంగి మండలం బెండపూడి గ్రామానికి చెందిన బెండపూడి గురువు కుమార్తె అల్లూరి సీతామహాలక్ష్మి కారులో కాకినాడ వెళుతున్నారు. పిఠాపురం బైపాస్‌రోడ్డులో పెట్రోల్‌బంక్ ఎదురుగా ఉన్న టీపాయింట్ వద్దకు వచ్చేసరికి గేదెలు అడ్డుగా రావడంతో కారును స్లో చేశారు. అదే సమయంలో ఏలేశ్వరం మండలం లింగంపర్తి నుంచి కాకినాడ వెళుతున్న ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. రెండు వాహనాల్లో బెలూన్లు తెరుచుకోవడంతో మాజీ ఎమ్మెల్యే వరుపుల సహా పలువురు అతి స్వల్పగాయాలతో బయటపడ్డారు. వరుపుల వెంటనే మరో వాహనంలో కాకినాడ వెళ్లిపోయారు. వాహన డ్రైవర్లు సుంకర రాజేష్, గుండం నాగేశ్వరరావులకు స్వల్పంగా గాయాలయ్యాయి. రెండు వాహనాల్లోని వారు కాకినాడకు వెళ్లిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇదిలా ఉంటే తాను క్షేమంగానే ఉన్నానని, అభిమానులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కాకినాడ ఎవరూ రావద్దని వరుపుల సుబ్బారావు ఓ వీడియో సందేశం పంపారు.



దెబ్బతిన్న మాజీ ఎమ్మెల్యే వరుపుల కారు

ఆదుర్రులో బుద్ధ పౌర్ణమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మామిడికుదురు, మే 23: ఆదుర్రులో బుద్ధ పౌర్ణమి వేడుకలను గురువారం బుద్ధ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదుర్రులోని ఆది బౌద్ధ స్థూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బుద్ధుని జీవిత విశేషాలతో కూడిన పాటలను ఆలపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎ వేమా, బుద్ధవిహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు నడిచిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో మెండా ఆదినారాయణ, బయ్యా మోహన్, అడపా వెంకటరత్నం, బళ్ల శ్రీనివాసరావు, పులపర్తి కృష్ణ, యర్రంశెట్టి తాతబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల వేషధారణలో బ్లేడ్‌బ్యాచ్ దందాలు

రాజమహేంద్రవరం రూరల్, మే 23: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామం శివారు గామన్ బ్రిడ్జి రోడ్డులో అర్ధరాత్రి దాటాక బ్లేడు బ్యాచ్‌ల ఆగడాలు మితిమీరుతున్నాయి. గత కొద్ది రోజులుగా కొన్ని బ్యాచ్‌లు గామన్ బ్రిడ్జి దిగువన గోదావరి గట్టు వద్దకు చేరి మద్యం మత్తులో రోడ్డుపైకి వచ్చి అటుగా వెళ్లే వాహనాలకు అడ్డంగా నిలబడి దందాలు చేస్తున్నారు. బ్లేడులు, కత్తులు, బీరు సీసాలు చేతపట్టుకుని భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. గత అర్ధరాత్రి ఈ బ్యాచ్‌లలో రెండు వర్గాలకు గొడవలు జరిగి రోడ్డుపై రాడ్‌లతో కొట్టుకుని దారుణంగా వ్యవహరించారని అటుగా లారీలో వెళ్లిన ఒక డ్రైవర్ తెలిపారు. లారీ ఆపి కిందకు దిగితే దాడి చేస్తారనే భయపడి ఆపకుండా వెళ్లిపోయినట్టు ఆ డ్రైవర్ చెప్పాడు. కొంత మంది యువకులు హిజ్రాల వేషధారణలో తిరుగుతున్నట్లుగా కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా కాతేరు గ్రామంలో మెయిన్ రోడ్డు, మల్లయ్యపేట, గణపతినగర్, ఆనంద్ నగర్ రోడ్డు, శాంతి నగర్ రోడ్డు ప్రాంతాల్లో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటాక బైక్‌లు, స్కూటీలు వేసుకుని ఇనుప రాడ్‌లు, బ్లేడ్‌లు పట్టుకుని మత్తులో తిరుగుతున్నారని వారిని ఎవరని నిలదీస్తే దాడి చేసే పరిస్థితి ఉండడంతో ఎవరూ కూడా బయటకు రావడం లేదు. మత్తులో బ్లేడ్ బ్యాచ్‌లు, హిజ్రాల వేషాధారణతో కొంత మంది, బైక్‌లు దొంగతనాలు చేసేందుకు మరికొంత మంది ఇలా తిరగడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఏజెన్సీ సమాచారం

రేపటి నుంచి డొంకరాయి పవర్‌కెనాల్ మరమ్మతులు



మోతుగూడెం, మే 23: డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మత్తు పనులు ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో 16 కిలోమీటర్ల పొడవు ఉన్న డొంకరాయి పవర్ కెనాల్ రెండు రీచ్‌ల పరిధిలో సుమారు రూ.1.5 నుంచి 2 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను నిర్వహించేందుకు జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ పనుల కోసం ఇటీవల జెన్‌కో ఉన్నతాధికారులకు స్థానిక అధికారులు నివేదికను పంపించగా సీలేరు కాంప్లెక్సులో పర్యటించిన జెన్‌కో హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ ఇటీవల కెనాల్‌ను పరిశీలించి వెళ్లారు. ఈ నేపథ్యంలో పవన్ కెనాల్ మరమ్మతు పనులకు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు ఉన్నతాధికారులు ఎల్‌సీ అనుమతులు మంజూరు చేయడంతో రెండు రీచ్‌ల్లో కెనాల్ గ్రౌంటింగ్, కాంక్రీట్ పనులు నిర్వహణ కోసం జెన్‌కో అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నారు. దీని కోసం సీలేరు కాంప్లెక్సులోని కాంట్రాక్టర్లకు రెండు రీచ్‌లలో పనుల కోసం అవసరమయ్యే ఇసుక, మెటల్, సిమెంటు తదితర సామగ్రిని ఆయా రీచ్‌ల్లో సిద్ధం చేసి ఉంచాలని జెన్‌కో అధికారులు ఆదేశాల జారీ చేశారు. కాగా పవన్ కెనాల్ మరమ్మతుల పనులు జరిగే సమయంలో ఈ నెల 25 నుంచి వచ్చే 10 వరకు డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని నిలిచిపోనున్నట్లు జెన్‌కో అధికార వర్గాల ద్వారా సమాచారం. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్సు పరిధిలో 5 నుంచి 5.5 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

గిరిజనుల గొంతెండుతోంది

తాగునీరు లేక గోపాలపురం వాసుల ఇబ్బందులు



చలమల నీరు తోడుకుంటున్న దృశ్యం

మోతుగూడెం, మే 23: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో గూడూరు పంచాయతీ గోపాలపురం గ్రామంలో తాగునీరు లేక గొంతెండుతోంది. ఈ గ్రామంలోని పై గుంపులలో సుమారు 8 కుటుంబాలు 40 మందికి పైగా గత 40 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ 8 కుటుంబాల వారికి తాగడానికి తాగునీరు లేక గుక్కెడు మంచినీటి కోసం పుట్టెడు కష్టాలు పడుతున్నారు. ఈ గ్రామంలోని పై గుంపులో ఒక్క బోరు కూడా లేకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కుటుంబాలు తాగునీటి కోసం కిలోమీటర్ల మేర నడిచి మార్చేగు ఊటగుంట మీద ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. వలస ఆదివాసీ గ్రామం కావడంతో ఆ గ్రామానికి బోర్లు వేయడానికి అనుమతులు రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీవో గారు మా గోడును పట్టించుకోరూ..

చింతూరు ఐటీడీఏ పీవో గారూ మా మంచినీటి గోడును పట్టించుకోరా అని గోపాలపురం పై గుంపు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమ గ్రామంలోని పై గుంపులో గత 40 సంవత్సరాలుగా 8 కుటుంబాలకు చెందిన 40 మంది మంచి నీటి కోసం తంటాలు పడుతున్నారని, గ్రామంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను అర్థంచేసుకుని మంచినీరు బోరువేయాలని గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు.

కౌంటింగ్ రోజున హద్దు మీరితే చర్యలు

ఎటపాక,మే 23: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎటపాక సర్కిల్ పరిధిలో రాజకీయ పార్టీల నాయకులు హద్దు దాటితే చర్యలు తీసుకుంటామని సీఐ డి.రామారావు హెచ్చరించారు. ఎటపాక పోలీస్ స్టేషన్‌లో గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజున సంబరాలు, ర్యాలీలు, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. ఆయిల్ బంకులు, షాపుల్లో లూజు పెట్రోల్ విక్రయాలు చేయవద్దని సూచించారు. గెలుపోటములపై సమన్వయంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కరి పార్థసారథి, జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, నలజాల మధు, సీపీఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, వెంకన్నబాబు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జల పుష్పాల వేట

ఎటపాక, మే 23: ఎటపాక మండలం గౌరీదేవిపేట చెరువులో గురువారం గిరిజనులు చేపల వేటను నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు మూకుమ్మడిగా సంప్రదాయ వేటలో పాల్గొన్నారు. సంప్రదాయ వలలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేటను సాగి ంచారు. ఈ వేటలో గిరిజన కుటుంబ సభ్యులందరూ పాల్గొనడం విశేషం.



చేపల వేట నిర్వహిస్తున్న దృశ్యం

వైన్ షాపులో చోరీకి యత్నం

కూనవరం, మే 23: మండలంలోని టేకులబోరులో ఉన్న వైన్‌షాపులో బుధవారం రాత్రి చోరీకి ప్రయత్నించారు. రాత్రి 10గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి వైన్‌షాపు వెనుక ఉన్న తలుపులను పగులగొట్టారు. ఒక వ్యక్తి షాపులోకి చొరబడి అక్కడ ఉన్న క్యాష్‌బాక్సులో ఉన్న డబ్బును దొంగలించే ప్రయత్నం చేశారు. డబ్బులు బాక్సు తెరుచుకోకపోవడంతో షాపులో ఉన్న ఒక ఫుల్‌బాటిల్, రెండు క్వార్టర్ బాటిళ్లు ఎత్తుకెళ్లాడు. షాపులోకి చొరబడ్డ వ్యక్తి ముఖానికి టవల్ చుట్టుకుని ప్రవేశించడంతో గుర్తించడానికి కష్టంగా మారింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

వరరామచంద్రాపురం, మే 23: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాలు నందు శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఫణీందర్ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన సూచించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు సమాచారంతో హాజరు కావాలని తెలిపారు.

30న మీటింగ్

దేవీపట్నం, మే 23: ఈనెల 30వ తేదీన దేవీపట్నం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల షెడ్యూల్ వాయిదా

కలెక్టరేట్(కాకినాడ), మే 23: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో శుక్రవారం, శనివారం జరగాల్సిన ప్రవేశాల కౌన్సిలింగ్ తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆ సంస్థ జిల్లా సమన్వయ అధికారి వెల్లడించారు.

కోల్‌కత్తా న్యాయస్థానం తీర్పు స్వాగతిస్తున్నాం

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వం ఇచ్చిన ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తూ కోల్‌కత్తా ప్రధాన న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా పేర్కొంది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే బీసీ రిజర్వేషన్లను ముస్లింలకు ఇస్తూ బీసీల అభివృద్ధిని మమతా బెనర్జీ నిర్వీర్యం చేశారన్నారు.ఈ తీర్పును అంగీకరించేదిలేదని మమతా బెనర్జీ చెప్పడాన్ని ఖండిస్తున్నామన్నారు.

రైల్వే కోచ్ రెస్టారెంట్.. ఇంత నిర్లక్ష్యమా

- అగ్ని ప్రమాదం జరిగితే బూడిదే
- భద్రత గాలికొదిలేశారు..
- కాంట్రాక్టరు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంపై ప్రయాణికుల మండిపాటు



వంటల కోసం కోచ్ బయట ఉంచిన గ్యాస్ సిలిండర్లు

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): రాజమ హేంద్రవరం రైల్వేస్టేషను ప్రాంగణంలో ఉన్న రైల్వే కోచ్ రెస్టారెంట్‌లో భద్రత గాలికొదిలేశారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంపై ప్రయాణికులు మండిపడు తున్నారు. ఈ రెస్టారెంట్‌కి ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. పరిస్థితులు చూస్తే మాత్రం అగ్ని ప్రమాదం జరిగితే బూడిద మిగిలే విధంగా ఉన్నాయి. వంటల కోసం కోచ్ బయట గ్యాస్ సిలిండర్లను ఉంచారు. ఇవి ప్రమాదాన్ని ఆహ్వానించే విధంగా ఉన్నాయి. గ్యాస్ సిలిండర్లను వేడి నీళ్లలో పెట్టడం, వాల్చడం, భూమికి సమాంతరంగా ఉంచడం చేయకూడదు. అలాగే నిండు సిలిండర్లను ఒకేచోట ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉంచకూడదు. సిలిండర్లకు ఎండ తగలకుండా ఏర్పాట్లు ఉండాలి. కానీ ఇక్కడ వాట న్నిటినీ ఉల్లంఘిస్తున్నారు. మొత్తం రెం డుచోట్ల సిలండర్లను ఉంచగా.. ఒకచోట సిలిండర్లను వేడి నీటిలో పెడుతు న్నారు. అక్కడికి దగ్గరగా మరోచోట 4 నిండు సిలిండర్లను ఒకేచోట ఉంచారు. దీనివల్ల ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే నష్టం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. రైలు కోచ్ రెస్టారెంట్ లోపల, బయట పెయింట్, లోపల సోఫాలు, అలంకరణకు వాడిన ప్లైవుడ్.. ఇలా అన్నీ మంటలు క్షణాల్లో వ్యాప్తి చెందేలా చేస్తా యి. పైగా ఈ కోచ్ లోపల ఇరుకుగా ఉండడమే కాకుండా బయటకు రావడానికి ఒకే చిన్నపాటి ద్వారం ఉంది. రాత్రి వేళల్లో ఈ రెస్టారెంట్ రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ రెస్టారెంట్‌లో కనీసం అగ్నిమాపక ఏర్పాట్లు కూడా లేకపోవ డంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఫైర్ ఎస్టింగ్విషర్ (అగ్నిమాపక సిలిండర్)లు కూడా లేవు. ఇటీవలే అధికారులు పలు అంశాల ఉల్లంఘనలపై రూ.60వేలు జరిమానా విధించారు. అయితే, అత్యంత ప్రమాదకరమైన అంశాలను సంబంధిత విభాగాల అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వినవస్తున్నాయి. తనిఖీల్లో డొల్లతనం రుజువు అవుతోంది. రైల్వే అంటే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, తమ పరిధిలోకి రాదని రాష్ట్ర ప్రభుత్వ అధికారు లు ఆటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆ ప్రాంతం రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు నిషేధితంగా భావిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వ చట్టాలను కూడా అనుసరించాలని, నిబంధన లను పాటించాలని రైల్వే ఒప్పందాల్లో ఉండడం గమనార్హం.



రాజమహేంద్రవరంలో బుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



వేమగిరిలో బుద్ధవిహార్‌లో బౌద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

సర్వమానవాళి సంక్షేమమే బుద్ధుడి మార్గం

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 : సర్వమానవాళి సుఖసంతోషాలతో జీవనం సాగించడమే బుద్ధుని మార్గం అని రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు అన్నారు. కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి సంయుక్త నిర్వహణలో గురువారం గౌతమ బుద్ధుడి జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. బుద్ధుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, అధ్యాపకులు డీవీ రమణమూర్తి, సూపరింటెండెంట్ హెచ్‌వీవీ నరసింహమూర్తి, అధ్యాపకులు ఎంఎస్ ఫణికుమార్, పీఏ కిషోర్‌బాబు, డి.మధులత, సీహెచ్ తులసీరామ్, సిరికి రాజబాబు, మాధవరావు, విద్యార్థి సంఘం అధ్యక్షుడు సీతారామనాయుడు పాల్గొన్నారు.

బుద్ధుని మార్గమే శరణ్యం : రాజశిఖామణి

కడియం, మే 23: యువతను సన్మార్గంలో నడిపేందుకు బుద్ధుని సూక్తులు ఆచరించాలని న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, విశ్రాంత ఎస్పీ డా. కె రాజశిఖామణి తెలిపారు. వేమగిరి బుద్ధ విహార్ ధర్మధామంలో గురువారం బుద్ధపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. బుద్ధవిహార్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహోదయ యాజరా, డా. రాజశిఖామణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన బుద్ధపౌర్ణమి వేడకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. 84 అడుగుల ఎత్తు ఉన్న బుద్ధవిగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం అసెట్ పూర్వ అధికారి డీఆర్ఎం శేఖర్, ఆర్గనైజేషన్ గౌరవ చీఫ్ పాట్రన్ మేజర్ డాక్టర్ ఎం.రాజశేఖర్, ఆర్గనైజేషన్ యోగా అసోసియేషన్ తెలంగాణా అధ్యక్షులు డాక్టర్ సీ వీ ఫణి, బిహేవియర్ థెరపిస్టు డా. శ్రీనిధి, జగ్గంపేట టీడీపీ సమన్వయకమిటీ సభ్యులు దారా ఏసురత్నం, ఎల్ వీ ప్రసాద్, మర్రి బాబ్జి, బర్రే కొండబాబు, దాసి వెంకట్రావు, కొంకి రమేష్, కె కె సంజీవరావు, విజయపాల్, జీ వీ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు బౌద్ధం స్వీకారం

దివ్యాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బౌద్ధపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా అధ్యక్షురాలు యర్రా ఉమామహేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుదర్శన్, ప్రజా గాయకుడు లాజర్, మహోదయ యాజరా, రాష్ట్ర అధ్యక్షుడు యనమదల వెంకటేశ్వరరావు, బౌద్ధబిక్షువు బోధిహిన్‌లు పాల్గొన్నారు. పలువురు దివ్యాంగులు బోధిహిన్ ఆధ్వర్యంలో బౌద్ధధర్మాన్ని స్వీకరించారు. జిల్లా అధ్యక్షుడు అంకం గంగరాజు, నారాయణం వీరరాఘవమ్మ, నల్గొండ రాంబాబు, చిక్కాల వినోద్‌కుమార్, మేడిద వెంకటరమణ, షేక్ అమీర్, మద్దిరెడ్డి వీరవెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

ధవళేశ్వరం, మే23: శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ప్రేరేపించినా అటువంటి వారిపై కఠిన చర్యలు చేపడతామమని దక్షిణ మండలి డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ హెచ్చరించారు. గురువారం ధవళేశ్వరం సీఐ వినయ్‌మోహన్, రాజమండ్రి టూటౌన్ సీఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి స్థానిక కంచర్ల లైన్‌లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా కొనసాగించనున్నట్లు తెలిపారు.

నేడు అనపర్తిలో పోలీసుల ఆధ్వర్యంలో మాబ్ డ్రిల్

అనపర్తి, మే 23 : అనపర్తి మెయిన్ రోడ్డులో శుక్రవారం పోలీసు ప్రత్యేక బృందం మాబ్ డ్రిల్ నిర్వహించనున్నట్లు సిఐ శివగణేష్ తెలిపారు. గురువారం అనపర్తి మెయిన్‌రోడ్డులో మాబ్ డ్రిల్ నిర్వహించేందుకు అనువైన ప్రదేశాన్ని ఎస్ఐ రామారావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మీడియాతో మాట్లాడుతూ మాబ్ డ్రిల్ నిర్వహించేందుకు శుక్రవారం మధ్యాహ్నం పోలీసు ప్రత్యేక బృందం అనపర్తి రానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్ కూడా పాల్గొంటారని సిఐ తెలిపారు. మాబ్ డ్రిల్‌లో పోలీసులు అనేక అంశాలను ప్రదర్శిస్తారని అల్లర్లు జరిగితే పోలీసులు తీసుకునే చర్యలను ఈ మాబ్ డ్రిల్ ద్వారా వివరిస్తారని సిఐ తెలిపారు.

మోటార్ సైకిల్ దొంగలకు దేహశుద్ధి

రాజానగరం, మే 23 : మోటార్ సైకిల్ దొంగతనం చేస్తూ పట్టుబడిన దొంగలకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడు హైస్కూల్ వద్ద గురువారం బైక్ దొంగతనం చేస్తుండగా గ్రామస్థులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. పట్టుబడిన యువకులు కోటికేశవరం గ్రామానికి చెందిన వారుగా గుర్తించి రాజానగరం పోలీసులకు అప్పగించారు.

కత్తితో బెదిరించిన వ్యక్తికి రిమాండ్

ధవళేశ్వరం, మే 23: చాకుతో బెదిరించి డబ్బు, సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కున్న ఘటనలో నిందితుడు రంగాల దుర్గాసాయి అలియాస్ పులికి కోర్టు 14రోజులు రిమాండ్ విధించింది. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు మేరకు స్థానిక ఇందిరా కాలనీకి చెందిన చంద్రమళ్ళ మనోజ్ కంచర్‌లైన్‌లోని మరిడమ్మ గుడి వద్ద ఉండగా అదే వీధికి చెందిన రంగాల దుర్గాసాయి వచ్చి రూ. 500 ఇవ్వమని అడిగాడు. మనోజ్ లేవని చెప్పడంతో దుర్గాసాయి చాకుతీసి బెదిరించి మనోజ్ జేబులో ఉన్న రూ.1000లు నగదుతోపాటు సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయాడు. దీనిపై మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి. హరిబాబు కేసు నమోదుచేసి దుర్గాసాయిని అరెస్ట్‌చేసి 3వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు వద్ద నిందితుడిని హాజరుపరచగా మేజిస్ట్రేట్ అతనికి 14రోజులు డిమాండ్ విధించారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడియం, మే 23: సారా తరలిస్తున్న వ్యక్తిని కడియం పోలీసలు అరెస్టు చేశారు. సీఐ బి.తులసీధర్ వివరా ప్రకారం నామవరం సి-బ్లాక్‌కు చెందిన కొప్పిశెట్టి రామకృష్ణ అనే వ్యక్తిని చైతన్యనగర్ రైల్వేగేటు వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుంచి 100 లీటర్ల నాటుసారా, మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.కృష్ణసాయి తెలిపారు.

యువత సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం

- ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్

కడియం, మే 23: యువత సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో వెలుగుబంటి యూత్ సభ్యుడు చిలుకూరి ప్రభాకర్ ఇంటింటా తిరుగుతున్న సమయంలో ముండా రమ్యశ్రీ అనే 10 ఏళ్ల చిన్నారి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్నాడు. దీంతో పలువురు దాతలు స్పందించి రూ. 80వేల వరకు సహాయం అందించారు. ఈ మొత్తాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ బాధిత చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, వెన్నపు అయ్యప్ప, చిలుకూరి ప్రభాకర్, గుత్తుల హరీష్, తామెళ్ళ అయ్యప్ప, పొన్నగంటి శంకర్, బైవరపు మణి, తుమ్మ పండు, బొరుసు సురేష్ బీమన ప్రదీప్ తదితరులు ఉన్నారు.

వైసీపీ నేతలు చేసిన తప్పులే నేడు శాపాలుగా మారాయి

- అనపర్తి ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి



అనపర్తి, మే 23 : రాష్ట్రంలో ఐదేళ్ల పాటు పాలన చేసిన వైసీపీ నేతలు చేసిన తప్పులే నేడు వారికి శాపాలుగా మరా యని ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అరాచకాలకు మాచర్ల నియోజకవర్గంలో జరిగిన సంఘ టనలే ఉదాహరణలని ఆయన అన్నారు. అనపర్తి నియోజక వర్గంలోసైతం పోలింగ్ సమయంలో అరాచకాలకు పాల్పడు తుంటే ఎన్డీయే కార్యకర్తలు వారిని నిలువరించగలిగారని అన్నారు. పోలింగ్ సమయంలో మధ్యాహ్నం సమ యానికి అనేక బూత్‌లలో వైసీపీ ఏజెంట్లు కూడా లేకుండాపోయారని అన్నా రు. గొల్లలమామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో వైసీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడబోయారని వారిని ఎన్డీయే కార్యకర్తలు పోలీసులు నిలువరించారని అన్నారు. చివరకు మైనర్ బాలికతో దొంగ ఓటు వేయించిన ఘటనపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. జూన్ 4న అసలు విషయం బయటపడుతుందని ప్రజలు ఎన్డీయే కూటమి వైపే ఉన్నారని తేటతెల్లమౌతుందన్నారు. రాష్ట్రంలో కూటమి 145 సీట్లతో విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమా ణం చేయడం ఖాయమని, దేశంలో నరేంద్రమోడీ మూడవ సారి ప్రధానిగా ప్రమాణం చేయడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో ఎన్డీయే నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, మామిడిశెట్టి శ్రీను. కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎన్ఆర్‌కె ప్రసాదరెడ్డి, తాడి గంగిరెడ్డి పాల్గొన్నారు.

అనపర్తిలో నల్లమిల్లి విజయం తథ్యం

అనపర్తి నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం తథ్యమని ముస్లిం సోదరులు ఆకాంక్షించారు. గురువారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ దరియా సాహేబ్ ఆధ్వర్యంలో నల్లమిల్లిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా రాజశ్యామల యాగం



యాగక్రతుల్లో బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి, కుమార్తెలు

రాజానగరం(కోరుకొండ), మే 23: వైశాఖ పౌర్ణమిని పురస్క రించుకుని కోరుకొండ మండలం గాదరాడ ఓం శివశక్తి పీఠంలో నియోజకవర్గ ఎన్డీయే అసెంబ్లీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన రాజశ్యామల యాగం వైభవంగా ప్రారంభమైంది. మహా సుదర్శన సహిత రాజశ్యామల యాగం, లక్ష్మీగణపతి నవగ్రహ శత్రు సంహార రుద్ర సహిత మహాచండీ యాగం, అష్టలక్ష్మి మహా మృత్యుంజ య, భైరవ సహిత రాజశ్యామల యాగం, మన్య సుక్త ఆంజ నేయ, ధన్వంతరి ఆరోగ్య పాశుపతి సహిత మహా సుదర్శన యాగ క్రతువులను తమిళనాడుకు చెందిన 30 మంది వేదపం డితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవోపేతంగా జరిపించారు. కార్యక్రమంలో బలరామకృష్ణ కుమార్తెలు ప్రత్యూ షాదేవి, వందనాంబికతో పాటుగా నియోజకవర్గంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, మే23 : రాజమహేంద్రవరంలో 500 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫాం ఖాకీ చొక్కాలను దహించు అగ్ని మినిస్ట్రీస్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ థామస్, పాస్టర్ కృపాజయశీలన్, షీబా థామస్ గురువారం పంపిణీ చేశారు. తన తల్లి సెల్వమ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఖాకీ చొక్కాలు పంపిణీ చేశామన్నారు. సీతానగరం మండలం కాటవరంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితంగా మినరల్ వాటర్ అందించామని థామస్ తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం సరికాదు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వైరాల



సమావేశంలో మాట్లాడుతున్న వైరాల అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, మే23 : ప్రైవేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలుపుదల సరికాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వైరాల అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాల యం ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేట్ ఆసుపత్రులు యాజమాన్యాలు కలిసి పేదల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ సేవలందక ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద ఏ ఒక్కరు మరణించినా తీవ్రపరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ బిల్లులను ఆసుపత్రులకు చెల్లించి సేవలు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, బాబు రాజేంద్రప్రసాద్, న్యాయవాది మర్రి బాబ్జి, తుమ్మల తాతారావు, కండవల్లి లక్ష్మి, డాన్ సూరి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పూసపల్లి కుట్ర కేసును వెనక్కి తీసుకోవాలి'

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 : పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, తదితరులపై తెలంగాణ రాష్ట్రం ఇల్లందు పోలీసులు బనాయించిన పూసపల్లి కుట్రకేసును ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులపై మోపిన తప్పుడు కేసులన్నీ ఎత్తివేస్తామని చెప్పారని, దానికి విరుద్ధంగా విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులపై తప్పుడు కేసులు బనాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఆర్ట్స్ కళాశాల రికార్డు

- ఫైనలియర్‌లో 90.7 శాతం విద్యార్థులు పాస్



డిగ్రీ ఫైనలియర్ ఫలితాలు విడుదల చేస్తున్న ఆర్‌జేడీ శోభారాణి, ప్రిన్సిపాల్ రామచంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాల్లో సరికొత్త రికార్డు సాధించిందని, పరీక్షలు పూర్తయిన పది రోజులకే ఫలితాలను ప్రకటించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు గురువారం జోన్-1, 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.శోభారాణి ఈ ఫలితాలను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ ఫైనలియర్‌లో 90.7 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. అధ్యాపక సిబ్బంది కృషితో అద్భుత విజయం సాధ్యమైందన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభించనున్న వినూత్న సింగిల్ మేజర్, సర్టిఫికెట్ కోర్సులపై ఆర్‌జేడీ శోభారాణి సమీక్షించారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ సమన్వయకర్త డి.సంజీవ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త ఏ.అన్నపూర్ణ, పరీక్షల నియంత్రణాధికారి వి.బాబ్జి, ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటర్ సీహెచ్ సంజీవ్‌కుమార్, స్టాఫ్ కౌన్సిల్ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత ఇంట్లో

ఇండోర్ ప్లాంట్స్ నరికివేత



ఊలపల్లిలో నరికివేసిన ఇండోర్ ప్లాంట్స్

బిక్కవోలు, మే 23: పర్యావరణాన్ని రక్షిస్తూ, ఇంటికి అందాన్నిచ్చే మొక్కలను నరికివేసిన సంఘటన ఊలపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన టీడీపీ నేత ముల్లంగి వెంకటకృష్ణారెడ్డి ఇంటి ఆవరణలో అపురూపంగా పెంచుకుంటున్న ఇండోర్ ప్లాంట్స్‌ను బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఈసందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా తమ ఇంటి ముందు వీధి దీపాలు వెలగడంలేదని, పంచాయతీకి తెలిపిన బాగు చేయలేదన్నారు. దీన్ని అదునుగా తీసుకుని వైసీపీ వారే ఈమొక్కలను నరికి వేశారని ఆరోపించారు. బిక్కవోలు మండలం ఏర్పాటైన 1983లో మాతల్లి ముల్లంగి గౌరి ఎంపీపీగా వ్యవహరించారని, అలాగే మా తండ్రి పెదబాబు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారని, దీంతో తమపై వారే కక్ష కట్టి మొక్కలను నరికివేసి ఉంటారన్నారు. వీటిని థాయ్‌లాండ్, మెడగవాస్కర్ నుంచి రప్పించామని, సుమారు 15 మొక్కలు వరకూ నరికివేశారన్నారు. వీటిలో డిడేరియా మెడగాస్కరీన్సిస్, పచిపోడి యంగేయ్, అరాబికమ్, జోత్రాఫాపొడగ్రికా, అడేనియమ్‌స్పెసిమెన్స్ వంటి మొక్కలు ఉన్నాయన్నారు. వీటి విలువ రూ.2లక్షలు వరకూ ఉంటుందన్నారు. ఈఘటనపై బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేశానని కృష్ణారెడ్డి వివరించారు.

మండలాలకు చేరిన పాఠ్యపుస్తకాలు

బిక్కవోలు, మే 23: విద్యాకానుకల్లో భాగంగా 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు గురువారం మండలానికి చేరాయి. ఈ సందర్భంగా ఎంఈవో సీవీవీ. సత్యనారాయణ మాట్లాడుతూ మండలానికి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 13వేల పుస్తకాలు అవసరమౌతాయని, అయితే ప్రస్తుతం 9వేలు వచ్చాయన్నారు. ఇంకనూ 7వ తరగతి మొత్తం పుస్తకాలు, 1, 3 తరగతుల లెక్కలు వర్క్‌బుక్స్, 4, 5 తరగతుల ఈవీఎస్ వర్క్‌బుక్స్, మేథ్స్ టెస్ట్ బుక్స్ రావలిసి వున్నాయన్నారు. వీటిని స్థానిక ఇంగ్లీషు మీడియం పాఠశాలలో భద్రపరుస్తున్నామన్నారు. పాఠశాలలు తెరచేరోజున ప్రతి విద్యార్థికి విద్యాకానుక కిట్లు అందజేస్తామన్నారు. ఈయన వెంట ఎంఈఓ-2 కె. పూర్ణచంద్రరావు, ఎంఆర్‌సీ సిబ్బంది వున్నారు.

అచ్చుతాపురంలో కార్డెన్ సెర్చ్

- రికార్డులు లేని 20 మోటారు సైకిళ్లు స్వాధీనం



అచ్చుతాపురంలో కార్డెన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

గోకవరం, మే23: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యేకచర్యలు చేపడుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఉదయం నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, కోరుకొండ సీఐ అడపా నాగమురళి పర్యవేక్షణలో గోకవరం ఎస్ఐ కె.నాగరాజు, ఇతర పోలీస్ సిబ్బంది కలిసి మం డలంలోని అచ్చుతాపురం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తుల వివరా లను అడిగి తెలుసుకోవడంతో పాటు, సక్రమంగా రికార్డులు లేని 20 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.

ఆరోగ్య శ్రీ సేవలపై గందరగోళం

- కొన్ని ఆసుపత్రుల్లో సేవలు ప్రారంభం
- పట్టుబడుతున్న మరికొన్ని ఆసుపత్రులు
- ఆరోగ్యశ్రీ వర్తించదంటున్న యాజమాన్యాలు
- అయోమయంలో రోగులు



రాజమహేంద్రవరం అర్బన్, మే 23 : జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలిచిపోవడంతో వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చే రోగులు తీవ్రమైన గందరగోళానికి గురవుతున్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల వారు చాలా తెలివిగా .. బిల్లుల కోసం ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాం అని చెప్పకుండా ఈ రోగానికి ఆరోగ్యశ్రీ వర్తించదు అని చెప్పి పంపుతున్నట్టు తెలిసింది. పెండింగ్‌లో ఉన్న బిల్లు బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. కానీ రోగులకు, వారి కుటుంబీకులు చాలా మందికి ఈ కబురు ఆసుపత్రికి వచ్చిన తర్వాత కానీ తెలియకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ఇదిలా ఉంటే జిల్లాలోని 36 ప్రైవేట్ ఆసుపత్రులకు మెజార్టీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు గురువారం సాయంత్రం నుంచి నెమ్మదిగా ప్రారంభించినట్టు తెలిసింది. వీరికి బిల్లు బకాయిలు కొంతమేర చెల్లించడంతో ఆరోగ్యశ్రీ కేసులు తీసుకుంటున్నట్టు తెలిసింది. కానీ ప్రధానమైన ఆర్థోపెడిక్, కార్డియాలజీ వంటి ఐదు, ఆరు ఆసుపత్రులు మాత్రం తమకు బిల్లు బకాయిలు భారీగా ఉన్నందున వాటిని చెల్లిస్తేనే కానీ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు అందించలేమని అధికారులకు స్పష్టం చేసినట్టు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల నుంచి హెచ్చరికలు వచ్చినా తాము ఆరోగ్యశ్రీ సేవలు తిరిగి ప్రారంభించేది లేదని మంకుపట్టు పట్టినట్టు తెలిసింది. వీళ్లను గురువారం రాత్రికి ఒక కొలిక్కి తీసుకొచ్చి సమస్య పరిష్కరించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.అదే జరిగితే శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు జిల్లాలో పూర్తిగా ప్రారంభించే అవకాశం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి.

నిలిచిన ఈ -ప్రగతి సేవలు?

ఆర్‌టీవో కార్యాలయంలో ఆగిన సర్వీసులు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ప్రగతి సాఫ్ట్‌వేర్ నిర్వాహకులకు మధ్య విభేదాల వల్ల ఆర్‌టీవో కార్యాలయంలో సిటిజన్ సర్వీసులు అందించే ఈ ప్రగతి సేవలు ఆగిపోయాయి. ఈ సేవలు బుధవారం ఆగిపోవడంతో ఆర్‌టీవో కార్యాలయాల చుట్టూ వినియోగదారులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వాహనాల ఫిట్‌నెస్ సేవల నుంచి రిజిస్ట్రేషన్లు , లైసెన్సులు వంటి సేవలన్నీ నిలిచిపోయాయి. వాస్తవానికి కొంతకాలం కిందటే ఈ - ప్రగతి సాఫ్ట్‌వేర్ ఆగిపోతుందనే ప్రచారం జరిగింది. దీనికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం వాహన్ -సారథి పేరుతో విడిగా సేవలందించే సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. కానీ దీని ప్రొసెస్ కఠినతరం కావడంతో ఎవరు సేవలు పొందడంలేదు. సులభంగా ఉన్న ఈ-ప్రగతి సేవలనే వినియోగిస్తున్నారు. కాని ఆకస్మికంగా ఈప్రగతి సర్వీసులు ఆగిపోవడంతో ఆర్‌టీ వో కార్యాలయ సేవలన్నీ నిలిచిపోయాయి. స్కూల్ తెరిచే సమయం ఇది కావడంతో బస్సుల ఫిట్‌నెస్ అవసరమైనా ఈ సర్వీసు కూడా ఆగిపోయింది. అధికారులు దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోతున్నారు.

కౌంట్‌డౌన్



- జూన్ 4న కౌంటింగ్
- ఉదయం 5 గంటలకే ఆరంభం
- మధ్యాహ్నం 12 తర్వాత ఫలితం వెల్లడి
- తొలి ఫలితం కొవ్వూరుదే
- చివరి ఫలితం రాజమండ్రి రూరల్
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు షురూ

రాజమహేంద్రవరం, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఫలితాలు వచ్చేస్తున్నాయి.. ప్రజా తీర్పునకు రోజులు దగ్గరపడుతున్నాయ్.. సరిగ్గా 11 రోజులే గడువుంది.. దీంతో అధికారులు లెక్కింపు ఏర్పాట్లలో మునిగితేలుతుండగా.. అభ్యర్థులు ఇంకా లెక్కల తక్కెడలో ఉన్నారు.. ఎవరికి వారు అంచనాలు వేసుకుంటూ మాదే పైచేయి అని చెప్పుకుంటున్నారు. ఓటరు తీర్పు ఎవరిని వరిస్తుందో మరి 11 రోజుల్లోనే తేలిపోనుంది. జిల్లాలో మొదట కొవ్వూరు.. చివరగా రాజమహేంద్రవరం రూరల్ ఫలితం వెలువడుతుంది.ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లను జూన్ 4వ తేదీన లెక్కించనున్న సంగతి తెలిసిందే. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధి ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును నన్నయ వర్శిటీలో నిర్వహిస్తారు. ఈవీఎంలన్నీ కట్టుదిట్టమైన మూడంచెల భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లలో ఉన్నాయి.జిల్లాలో మొత్తం 16,23,149 మంది ఓటర్లు ఉండగా 1577 పోలింగ్ కేంద్రాల్లో 13,13,630 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది 80.93 శాతం. ఓట్ల లెక్కింపునకు రౌండ్‌కు 14 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి రౌండ్‌లోనూ అసెంబ్లీ ఓట్లకు 14 టేబుళ్లు, పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి టేబుల్ వద్ద పర్యవేక్షకుడు, సహాయ పర్యవేక్ష కుడు, ఒక మైక్రో అబ్జర్వరు ఉంటారు. వీరి పర్య వేక్షణలో అభ్యర్థులు లేదా, వారు ప్రతిపాదించిన ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. లెక్కింపు ప్రక్రియ పరిశీలనకు కేంద్ర ఎన్నికల కమిషన్ నలుగురు పరిశీలకులను నియమించింది. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను వీఆర్ ఏల ద్వారా కౌంటింగ్ కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రత మధ్య తరలిస్తారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత తిరిగి వాటిని భద్ర పరుస్తారు. కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ఉద యం 5 గంటల నుంచే ఆరంభమవుతుంది.మొదట పార్లమెంట్ అభ్యర్థికి పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, తర్వాత అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తారు. అనంతరం ఈవీఎం వారీ ఓట్ల లెక్కింపు ఆరంభిస్తారు. మొదటి రౌండ్‌లో 35 నుంచి 40 నిమిషాల్లో లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేశారు. తర్వాత ప్రతి రౌండ్‌కు 20 నిమిషాలు పడుతుంది.మధ్యలో లెక్కింపు పూర్తయిన ఈవీఎంలను తరలి ంచడం,లెక్కించాల్సినవి తేవడానికి కొంత సమయం పడు తుంది. అభ్యంతరాల్లేక పోతే మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల మధ్య తొలి ఫలితం వచ్చే అవకాశం ఉంది. లెక్కింపునకు అవసర మైన ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం వెలగపూడి నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలతతో సమీక్షించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు పరిశీలన..

దివాన్‌చెరువు, మే 23 : కౌంటింగ్ రోజున నిఘా వ్యవస్థ నన్నయ వర్శిటీని తమ ఆధీనంలోకి తీసుకుంటుందని జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి గురువారం సాయంత్రం నన్నయ వర్శిటీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు, కమాండ్ కం ట్రోల్ రూమ్, మీడియా విభాగం వద్ద నిర్వహించే భద్రత తదితర ఏర్పాట్లను పరిశీలించారు. నోడల్ అధికారులకు సూచనలు చేసి అక్కడ రిజిస్టర్లలో సంతకాలు చేశారు. ముఖ్యమైన ప్రదేశా లను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. నన్నయ వర్శిటీ చుట్టుప్రక్కల పోలీసు విభాగానికి చెందిన 7 సోలార్ సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.లెక్కింపు కేంద్రంలో కంట్రోల్ రూమ్ జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో 24 గంటలు పనిచేస్తుందన్నారు.నన్నయ వర్శిటీ పరిధిలో ఒక కిలోమీటరు వరకూ సెక్షన్ 144 అమలులో ఉంటుందన్నారు. జూన్6 వతేదీ వరకూ జిల్లా మొత్తం కవర్ చేస్తూ 30 పోలీస్ యాక్ట్ ప్రొసీడింగ్స్ జారీ చేశామన్నారు. ఒక అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద బందోబస్తు ఉందని చెప్పారు.

కౌంటింగ్‌కు కార్యాచరణ : కలెక్టర్

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి) : ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా పూర్తి చేయడానికి పోలీస్, జిల్లా ఎన్నికల యంత్రాంగం సంయుక్త కార్యా చరణ ప్రణాళిక సిద్ధం చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాధవీలత తెలిపారు.స్థానిక కలెక్టరేట్ నుంచి ఆమె ఎన్నికల ఏర్పాట్లపై ఎస్పీ, రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు,ఫలితాల వెల్లడికి సంయుక్త కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. భద్రత, ముందస్తు చర్యలపై అభ్య ర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిధిలో ఏడు సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోటీచేసిన అభ్యర్థుల ఇళ్ల వద్ద, రాజకీయ పార్టీల ఆఫీ సుల వద్ద సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి వ్యక్తులు, సమూహాల కదలికలపై దృష్టిపెట్టాలన్నారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రతి కౌంటింగ్ హాల్ వద్ద తప్పకుండా ఒక వీడియో గ్రాఫర్‌ను ఏర్పాటు చేయాల న్నారు.ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్వో జి.నరసింహులు కమిషనర్ కె.దినేష్‌కుమార్ పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ తదితరులు

ఓట్ల లెక్కింపు సాగుతుందిలా..

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీ ఓట్ల లెక్కింపు పోలింగ్ స్టేషన్ల సంఖ్యను బట్టి రౌండ్లగా విభజించారు. ప్రతి రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాల పరి ధిలో పోలైన ఓట్లను లెక్కిస్తారు. అసెంబ్లీ, పార్లమెంటరీ పరిధిలోని ఓట్లను ఒకేసారి సమాంతరంగా లెక్కిస్తారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కేవలం 13 రౌండ్లలో లెక్కిస్తారు. రాజమండ్రి రూరల్ ఓట్లను 20 రౌండ్లలో లెక్కిస్తారు. అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 228 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ 16 రౌండ్లలో 14 పీఎస్‌ల వంతున లెక్కించి, మిగిలిన 4 పోలింగ్ స్టేషన్ల లో ఓట్లను 17వ రౌండ్‌లో లెక్కిస్తారు. రాజానగరంలో 216 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిని 16 రౌండ్లలో లెక్కిస్తారు. 15 రౌండ్లలో 14 పోలింగ్ స్టేషన్ల వంతున ,మిగిలిన ఆరు పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను 16వ రౌండ్‌లో లెక్కిస్తారు. రాజమండ్రి సిటీలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. మొదట 16 రౌండ్లలో ఒక్కో రౌండుకు 14 పీఎస్‌ల వంతున లెక్కిం చగా.. మిగిలిన 13 పీఎస్‌లను 17వ రౌండ్‌లో లెక్కి స్తారు. రాజమండ్రి రూరల్‌లో 267 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 20 రౌండ్లలో ఓట్లు లెక్కిస్తారు. మొదట 19 రౌండ్లలో ఒక్కో రౌండ్‌కు 14 పిఎస్‌ల వం తున లెక్కించగా మిగిలిన ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓట్లను 20వ రౌండ్‌లో లెక్కిస్తారు. కొవ్వూరులో 176 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 13 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. మొదట 12 రౌండ్లలో ఒక్కో రౌండ్‌కు 14 పోలింగ్ స్టేషన్ల వంతున లెక్కించి, మిగిలిన 8 పీఎస్‌ల పరిధిలోని ఓట్లను 13వ రౌండ్‌లో లెక్కిస్తారు. నిడదవోలులో 205 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 15 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. మొదట రౌండ్లలో ఒక్కో రౌండ్‌కు 14 పీఎస్‌ల వంతుల లెక్కించి, మిగిలిన 9 పీఎస్‌ల పరిధిలోని ఓట్లను 15వ రౌండ్‌లో లెక్కిస్తారు. గోపాలపురంలో 248 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. మొదట 17 రౌండ్లలో ఒక్కో రౌండుకు 14 పీఎస్‌ల వంతున లెక్కించి, మిగిలిన 10 పీఎస్‌ల పరిధిలోని ఓట్లను 18వ రౌండ్‌లో లెక్కిస్తారు.

ముందే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు..

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గానికి పోలైన ఓట్లను ప్రత్యేకంగా, అసెంబ్లీ పరిధిలో పోస్టల్ బ్యాలెట్లను అసెంబ్లీల వారీ లెక్కిస్తారు. పార్లమెంట్ పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు అర్హత ఉన్నవాటిని 500 ఓట్ల వంతున ఒక కట్టగా కడతారు. నన్నయ్య వర్శిటీలో ప్రత్యేకంగా కేటాయించిన కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్ల ఏర్పాటు చేసి, పార్లమెంట్ సభ్యులకు పోలైన ఓట్లను ముందుగా లెక్కిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్‌ను ఆయా కౌంటింగ్ సెంటర్లలో చేపడతారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు..తర్వాత ఈవీఎం ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్ ప్రక్రియలో ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో ఎన్నికల అబ్జర్వర్ ఉంటారు. ఒక ఏఆర్వో, 18 మంది సూపర్‌వైజర్లు, 18 మంది సహాయకులు, 18 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. వివిధ పార్టీల ఎన్నికల ఏజెంట్లు కూడా ఉంటారు. అసెంబ్లీ ఈవీఎంలతోపాటు ఏకకాలంలో పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలు వెలువడిన సమయంలోనే రాజమహేంద్రవరం పార్లమెంట్ ఫలితం ప్రకటిస్తారు. అలాగే ప్రతి రౌండ్ ఎన్నికల ఫలితాన్ని ఎన్నికల అబ్జర్వర్లు అధికారికంగా ప్రకటించనున్నారు. ఎన్నికల అబ్జర్వర్లు ఫలితాల కాగితంపై సంతకం పెట్టిన తర్వాత మాత్రమే ప్రకటిస్తారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని, అసాంఘిక వ్యక్తుల కదలికలు, పాత నేరస్తులపై నిఘా పటిష్టం చేశామని ఎస్పీ జగదీశ్ పేర్కొ న్నారు. ప్రతి రోజూ కార్డన్ అండ్ సెర్చ్ సోదాలు చేస్తున్నా మన్నారు. దీనిలో భాగంగా గురువారం తెల్లవారుజామున అక్రమంగా నిల్వ ఉంచిన 22 మద్యం సీసాలు, 64 నెంబరు, రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే అసాంఘిక వ్యక్తులను ఉపేక్షి ంచేది లేదన్నారు.యువత అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు.అనుమానిత వ్యక్తులు, వస్తువులు, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, సారా, ఆయు ధాలు వంటి వాటిపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలి యజేయడం బాధ్యతగా భావించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.డయల్ 100,112కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చన్నారు.



ఏమైపోయారు.. వీళ్లంతా!?

పాలకులు కనబడుట లేదు..

మీకు మేమున్నాం.. మీ సమస్యేంటో చెప్పండి క్షణాల్లో పరిష్కరిస్తాం.. ఓటరు వెళ్లి అడిగిందే తడవు.. ఏ పనైనా రోజులో జరిగి పోయేది.. పోలింగ్ ముందు వరకూ ఇదీ సీన్.. మరిప్పుడు.. నాయకులు కనిపించడమే మానేశారు.. పోలింగ్ ముగిసిన నాటి నుంచి నాయకులు బయటకే రావడంలేదు.. కొంత మంది తమ నాయకుడు విదేశాలకు వెళ్లిపోతే.. మరికొంత మంది అదే బాటలో ఉన్నారు.. స్థానికంగా ఉన్న వారు సైతం ఇళ్లకే పరిమితమవుతున్నారు.. నాయకులు ప్రజలకు అందు బాటులో లేకపోవడంతో.. ఏమైపోయారో వీళ్లంతా అనుకుంటూ.. మా నాయకులు కనిపించడం లేదంటూ.. ప్రకటనలు ఇస్తామంటూ ప్రజలు సెటైర్లు వేసుకుంటున్నారు..

- జిల్లా అంతటా జగన్మాయ
- పోలింగ్ తర్వాత అంతా మాయం
- జగన్ బాటలోనే కొందరు..
- మరి కొందరు ఇంటికే పరిమితం
- కనిపించని ఆపద్ధర్మ పాలకులు
- వైసీపీ కేడర్‌లో తీవ్ర నైరాశ్యం
- సమస్యలు గాలికొదిలేశారు..
- ప్రజల ఎదురుచూపులు
- నిరుత్సాహంలో మండిపాటు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వై నాట్ 175 అని ఊదరగొట్టిన వైసీపీ నాయకులు పోలింగ్ అయిన తర్వాత జనాల్లో కనిపించడం లేదు. పంకా అధినేత ఇప్పటికే విదేశాలకు వెళ్లిపోగా.. రెక్కలు తెగిన దిక్కునకు తుర్రుమంటున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటై పాలకులు ప్రమాణ స్వీకారం చేసే వరకూ ప్రస్తుతం పదవుల్లో ఉన్న వాళ్లు ఆపద్ధర్మ(కేర్ టేకర్) పాలకులుగా ఉంటారు. కానీ పోలింగ్ సరళి నిశితంగా గమనించుకున్న వైసీపీ నేతలు మాత్రం పదవులు ఇక లేనట్లే అనే నైరాశ్యంలో మునిగిపోయినట్టు కనిపిస్తు న్నారు. అంతే పోలింగ్ తర్వాత రోజు నుంచి కనిపించడమే మానేశారు. కొంత మందికి ఇంటికే పరిమితమైతే మరి కొంత మంది ఊరు దాటిపోయిన తీరు వారిలో కనిపిస్తోంది. దీంతో వారి క్యాడర్ కూడా అయోమయంలో చిక్కుకుంది. రానున్న రోజులు గడవడంపై దృష్టి సారించాయి. వైసీపీ అభ్యర్థులుగా పోటీలో నిలిచిన వారికి భవిష్యత్ రాజకీయ జీవితం చీకటిగా కనిపిస్తుండడంతో ఎవరికీ అందుబాటులో ఉండడం లేదనే చర్చ నడుస్తోంది.

'ఆపద్ధర్మం' మరిచారా?

ప్రజలు ఎన్నికల ద్వారా ఎన్నుకొన్న ప్రజా ప్రతినిధుల ద్వారా లోక్‌సభ, శాసన సభలు ఏర్పాటవుతాయి. వాటి కాల పరిమితి ముగిసినా లేదా రద్దయినా ఆయా ప్రజా ప్రతినిధులు పదవులను కోల్పోతారు. మళ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతుంది. అలాంటి సమయంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు జరిగే వరకూ ప్రజలకు ఇబ్బందులకు కలుగకుండా కొన్ని పరిమితులకు లోబడి అప్పటి వరకూ పదవుల్లో ఉన్న వారు పాలన సాగిస్తారు. దీనినే ఆపద్ధర్మ(కేర్ టేకర్ గవర్నమెంట్) ప్రభుత్వం అంటారు. రాష్ట్రపతి, గవర్నర్ కోరిక మేరకు ప్రధాని, ముఖ్యమంత్రి ఆపద్ధర్మంగా కొనసాగుతారు. మంత్రులకు కూడా ఇదే వర్తిస్తుంది. ఆపద్ధర్మ ప్రభువులు విధాన నిర్ణయాలు తీసుకోడానికి వీల్లేదు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ నడుచుకోరాదు. బడ్జెట్ తయారీ, ఆర్డినెన్సుల జారీ, ఉన్నతాధికారుల బదిలీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటివి చేయకూ డదు. రోజు వారీ ప్రభుత్వ కార్యకలాపాలను మాత్రమే ఆపద్ధర్మ ప్రభుత్వం నడిపిస్తుంది. కార్యనిర్వాహక బాధ్యతలు నెరవేరుస్తుంది. ఆపద్ధర్మ ప్రభుత్వంలో ఉన్న ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తీర్చవచ్చు. ఒక రకంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందే. అయితే ప్రస్తుత ఆపద్ధర్మ పాలకుల్లో గతంలో ఎన్నడూ లేని వింత పరిస్థితి కనిపిస్తోంది. ఐదేళ్లు అయిపోయింది. ఇక ప్రజల సమస్యలు మనకెందుకు అనే తీరుతో వైసీపీ ప్రజాప్రతినిధులు ఎవరి సొంత పనులు వాళ్లు చూసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

ప్రజాప్రతినిధులు కనిపించరే..

పోలింగ్ రోజున హల్‌చల్ చేసిన వైసీపీ అభ్యర్థులు, నాయకులు తర్వాత ప్రజలకు దూరంగా గడుపుతున్నారు. అధినేత దగ్గర నుంచీ కింది స్థాయి కార్యకర్త వరకూ ఇదే ధోరణి అవలంభిస్తున్నారు. మొదటిగా ఆపద్ధర్మ సీఎం జగన్ లండన్‌కి లగ్జరీ విమానంలో వెళ్లిపోయారు. తర్వాత జిల్లాల్లోని నేతలు కూడా అధినేత మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఆయా అభ్యర్థుల కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. రాజమహేంద్రవరం వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ సిట్టింగ్ ఎంపీగా కూడా ఉన్నారు. ప్రతిరోజూ ప్రెస్‌మీట్లతో మునిగితేలేవారు.. అభివృద్ధి అంతా నేనే చేశానంటూ ఏదో ఒక మూల కనిపించేవారు.. సోషల్ మీడియానూ ఖాళీ ఉంచేవారు కాదు. పోలింగ్ ముగిసిన తర్వాత నుంచీ ఆయన ప్రజలకు అందుబాటులో లేరు. రూరల్ వైసీపీ అభ్యర్థి, ఆపద్ధర్మ మంత్రి వేణుగోపాలకృష్ణ రామచంద్రాపురం నుంచి రాజకీయ బదిలీపై ఇక్కడకు వచ్చిన విషయం తెలిసిందే.స్థానికంగా క్యాడర్ లేకపోయినా ఎన్నికల ముందు గత రెండు నెలలుగా ఎక్కడో చోట కొబ్బరికాయ కొడుతూ రోజూ మీడియాలో కనబడుతూ ఉండేవారు. అయినా స్థానికంగా కనబడడం లేదు. కొవ్వూరు వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు దేవరపల్లికి పరిమితమయ్యారు. నిడదవోలు వైసీపీ అభ్యర్థి శ్రీనివాసనాయుడు హైదరాబాద్ చేరుకున్నారు. కొవ్వూరు నుంచి బదిలీపై గోపాలపురం బదిలీపై వెళ్లిన ఆపద్ధర్మ హోంమంత్రి తానేటి వనిత సొంత పార్టీ నేతలతో విసిగిపోయి తీవ్ర ఆవేదనకు గురయ్యారని తెలుస్తోంది. తనకు ఓట్లు పడేలా చేస్తామంటూ డబ్బులు తీసుకొని మోసం చేశారని బాధను వెళ్లగక్కినట్లు చెబుతున్నారు. ఆమె కూడా ఇంటి పట్టున గడుపుతున్నారు. అనపర్తి వైసీపీ అభ్యర్థి సత్తి సూర్య నారాయణ రెడ్డి ఎన్నికల వరకూ మధ్యాహ్నం సమయంలో రోగులను పరీక్షించేవారు. పోలింగ్ తర్వాత సమయాన్ని పూర్తిగా వైద్యానికి కేటాయిస్తున్నారు. రాజానగరం వైసీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా సర్వేలు చేసుకుంటూ సమీక్షలు నిర్వహించుకుంటూ గడుపుతున్నారు. ఇదిలా వైసీపీ నేతల క్యాడర్, సిబ్బంది డీలా పడిపోయారు. సర్వేలు కూటమి వైపు విజయాన్ని చూపుతుండడం, పోలింగ్ సరళి కూడా అదే స్పష్టం చేస్తుండడంతో వైసీపీ ప్రజా ప్రతినిధులు నిస్తేజంగా గడుపుతుండడంతో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉందని క్యాడర్ వాపోతున్నారు.

ప్రజల నిరుత్సాహం

ప్రజా సమస్యలను గాలికొదిలేశారు.. నియోజక వర్గంలో ఎక్కడ సమస్య ఉన్నా పరిష్కరించాల్సిన బాధ్యత నాయకులదే. అయితే ఆ దిశగా నాయకులు ఎవరూ ఆలోచించడంలేదు. ఇదిలా ఉండగా జూన్ 4వ తేదీన కౌంటింగ్ నేపథ్యంలో తిరిగి వచ్చేందుకు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ వారంలో మళ్లీ నాయకులంతా నియోజకవర్గాల బాటపడతారు. ఏంటి సార్ ఇది అని నాయకులను అడిగితే ఏం చేస్తామయ్యా బాబు రెండు నెలలు నిద్రాహారాల్లేకుండా ఎన్నికలకు పనిచేశాం.. ప్రజల సమస్యలు చూస్తే.. మా సమస్యలెవరు చూస్తారని అంటుండం గమనార్హం. అయితే 2019 ఎన్నికల్లో ఓటు వేసి అధికారం కట్టబెట్టిన ప్రజలు మాత్రం పాలకుల కోసం ఎదురుచూస్తున్నారు. నిరుత్సాహంతో ఏ ప్రభుత్వం వచ్చినా మళ్లీ మరో ఐదేళ్లకు తీర్పు ఇచ్చేశాం.. ఇక మాతో పని ఎందుకుంటుంది అని మండిపడుతున్నారు.ఇదిలా ఉండగా ప్రతిపక్ష నాయకులు మాత్రం ప్రతిరోజూ నియోజకవర్గాల్లో తిరుగుతూ సమస్యలేంటో తెలుసుకుంటున్నారు.



సోడాల తయారీ పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

అనుమతుల్లేకుండా సోడాల తయారీ

పరిశ్రమపై విజిలెన్స్ అధికారుల దాడి

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్‌లోని పిడింగొయ్యిలో ఉన్న బ్లూ వేల్ బేవరేజెస్ సోడా, డ్రింక్స్ తయారీ పరిశ్రమలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు.విజిలెన్స్ ఎస్పీ ఎస్‌పీకేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా సంస్థ యజమాని చెక్క నవ దుర్గా భవానీ నిమ్మ, ద్రాక్ష, ఆరెంజ్, బ్లూబెర్రీ, పైనాపిల్ ఫ్లేవర్స్‌లో సోడా, కూల్‌డ్రింక్స్‌ను తయారు చేస్తున్నారు. సుమారు 10 లీటర్ల కృత్రిమ రంగులు, రుచులు కలిగిన సరుకును స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని ఎస్పీ వివరించారు.

ఉరివేసుకుని యువకుడి మృతి

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉరి వేసుకొని మృతి చెందడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వీరయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్మా కాలనీకి చెందిన జె.వీరబాబు తాపీ పనులు చేస్తుంటాడు. ఏడాది కిందట వివాహం జరిగింది. శుక్రవారం సాయంత్రం క్వారీ మార్కెట్ వద్ద ఉన్న ఓ హోర్డింగ్‌కి ఉరి వేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. వీరబాబు వ్యవసనాలకు బానిసయ్యాడని, ఇంటికి కూడా సరిగా వెళ్లేవాడు కాదని ప్రాథమికంగా గుర్తించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఏసీబీ అరెస్టు చేసిన అధికారికి రిమాండ్

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): అవినీతి అభియోగాలపై ఏసీబీ అరెస్టు చేసిన అధికారికి కోర్టు రిమాండ్ గురువారం విధించింది. కాకినాడ జిల్లా పరిశ్రమల శాఖలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న తమిడి మురళీ(61)ని 22న ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రాజమండ్రి ఏసీబీ స్పెషల్ కోర్టులో ఆయనను ప్రవేశపెట్టగా జూన్ 5 వరకూ కోర్టు రిమాండు విధించిందని ఏసీబీ అధికారుల తెలిపారు.

రేపు ఏపీపీఎస్సీ పరీక్ష

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ పరీక్ష శనివారం జరుగుతుందని..అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకూ మాత్రమే అభ్యర్థులను అనుమతిస్తారన్నారు. జిల్లాలో మొత్తం 960 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉందన్నారు. లూథర్‌గిరి లోని రాజీవ్ గాంధీ కళాశాలలోని అయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష నిర్వహిస్తారన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం


అన్నవరప్పాడు వెంకన్నకు మహాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

వెంకన్నకు మహాభిషేకం

పెరవలి, మే23: అన్నవరప్పాడు వెంకన్న కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి చక్రస్నానం, నిర్వహించారు. మహా భిషేకం నిర్వహించారు. ఆలయంలో మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల అనేక గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

తాళ్ళపూడి, మే 23: తాళ్ళపూడి గోదావరి గట్టు వద్ద గల గౌతమేశ్వరస్వామి, రమా సత్యన్నారాయణస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో వైశాఖ పూర్ణిమ సందర్భంగా గురువారంరాత్రి పూర్ణ చంద్రకాంతిలో సామూహిక సత్యన్నారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. తితిదే ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణ మాష్టారు మాట్లాడుతూ వైశాఖమాసంలో పౌర్ణమి తిథిలో చేసే పూజలు విశేష ఫలితాలిస్తాయని సత్యనారాయణ వ్రత కథను పూర్తిగా వివరిస్తూ వ్రతాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు సామూహిక వ్రతంలో సుమారు 60 జంటలు పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న వారికి అవసరమైన పూజా సామాగ్రి రేకపల్లి వీరాస్వామి దంపతులు ఉచితంగా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన గోవింద నామస్మ రణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కవల శ్రీనివాస్, డీవీవీ సత్యన్నారాయణ, గోలి అన్నవరం, శింగం శివరామకృష్ణ, అప్పన జగదీష్, కత్తిరి బ్రదర్స్, బోసికొండ వెంకస్వామి, మణికంఠ, పోసిబాబు, హనుమంతు, నాగేంద్ర పాల్గొన్నారు

నేటి నుంచి వెలగలమ్మ తల్లి జాతర



కొవ్వూరు, మే 23 : కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామదేవత శ్రీశ్రీశ్రీ వెలగలమ్మ తల్లి జాతర మహోత్సవాలు మూడురోజులపాటు నిర్వహించనున్నట్లు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. ఏడు సంవత్సరాల తరువాత గ్రామదేవతకు ఉత్సవాలు జరుపుతున్నామన్నారు. ఈ నెల 24, 25, 26 తేదీలలో జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నామన్నారు. శుక్రవారం సేవ, డప్పు, వాయిద్యాలు, మేళతాళాలతో గ్రామదేవత ఊరే గింపు, శనివారం గ్రామం చుట్టూ బలిచేట ఊరేగింపు, ఆదివారం జాతర ముగింపు సందర్భంగా అమ్మవారికి నైవేద్యాలు, మొక్కులు సమర్పిస్తారన్నారు.

బుద్ధుడి బోధనలు ఆచరణీయం


బుద్ధుడి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

తాళ్ళపూడి, మే 23 : తాళ్ళపూడి తహసీల్దార్ కార్యాలయంవద్ద గురువారం బుద్ధ పౌర్ణిమ వేడుకలు నిర్వహించారు. బుద్ధుని చిత్రపటానికి తహసీల్దార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బుద్ధుని లాంటివాళ్లు మళ్లీ పుట్టాలని ఒక వేల పుట్టినా ఆయనను సైతం మార్చేసే పరిస్థితిలో సమాజం ఉందని తెలిపారు. అనంతరం ఏఎస్‌వో జో డాల మాట్లాడుతూ ప్రపంచంలోనే మొట్టమొదటి విప్లవ కారుడు బుద్ధుడు అని మనస్సే ప్రధానం అని చెప్పి మధ్యేమార్గాన్ని సూచించిన మహానుభావునికి బుద్ధ జయంతి చేయడం అవసరమన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సీతారామరాజు, విఆర్‌వో సంజీవ రావు, విఆర్‌ఏలు శ్రీలక్ష్మి, రమణమ్మ, భాగ్యలక్ష్మి, వ్యవసా య సహాయకులు సుధీర్ పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు


వైష్ణవికి నగదు బహుమతి అందిస్తున్న రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు

నిడదవోలు, మే 23 : విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలో 10వ తరగతిలో 593 మార్కులు సాధించి టౌన్ ఫస్టటా పర్‌గా నిలిచిన తుట్టగుంట వైష్ణవికి శ్రీఆదిత్య డవలపర్స్ చీఫ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యనారాయణరెడ్డి రూ.10,116/-లు రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ ఎమ్.శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులంతా వైష్ణవిని ఆదర్శంగా తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బళ్ళ సత్యనారాయణ, తుట్టగుంట రామకృష్ణారావు, తదితర్లు పాల్గొన్నారు.

రోటరీ ఇంటర్నేషనల్‌కు విరాళం


రోటరీ ఫౌండేషన్‌కు విరాళం అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

నిడదవోలు, మే 23: రోటరీ ఇంటర్నేషనల్ పోలియో నివారణకు ఫండ్ రైజింగ్‌లో భాగంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ రూ.8.30లక్షలు విరాళం అందజేయడం ఎంతో అభినందనీయమని రోటరీక్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ రొటేరియన్ మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ రోటరీ ఇంటర్నేషనల్‌కు 8.30లక్షల రూపాయల విరాళం చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయిలో పోలియో నివారణ, పేదరికం, విద్యా వైద్య రంగాలలో సేవా కార్యక్రమాలకు వినియోగించేలా రోటరీ ఇంటర్నేషనల్‌కు ఈ విరాళం అందిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, మద్దుల సత్యనారాయణ, చిక్కాల రాజు, ఆకుల రామచంద్రారావు తదితర్లు పాల్గొన్నారు.

పాడి పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవాలి

కొవ్వూరు, మే 23: మే నెల చివరి వారం నుంచి జూన్ 15వ తేదీ వరకు వర్షాలుపడి ఉష్ణోగ్రతలో మార్పులు చోటుచేసుకోవడంతో పశువులలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని కొవ్వూరు పశు సంవర్ధకశాఖ ఏడీఏ వెంకటరెడ్డి తెలిపారు. గేదెలలో గొంతువాపు, గురకవ్యాధి, ఆవులు, ఎద్దులలో జబ్బువాపు లేదా బిక్కు, గొర్రెలు, మేకలలో చిటిక వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో అన్ని పశు వైద్యశాలలకు వ్యాధుల నివారణకు వ్యాక్సిన్ పంపిణీ చేశామన్నారు. రైతులు తమ పాడి పశువులకు వ్యాక్సిన్ వేయించి పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవాలన్నారు.

నిడదవోలులో గెలుపు మాదే

● నాయకుల్లో ఎవరి ధీమా వారిదే



పెరవలి, మే 23 : నిడదవోలు అసెంబ్లీ స్థానంలో గెలుపు ఎవరిదనే దానిపై ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. వైసీపీ నాయకులు గెలుపు తమదంటే ఉమ్మడి అభ్యర్థిగా వచ్చిన గెలుపు మాదే నని ఉమ్మడి పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఓట్ల లెక్కింపు ఉన్నప్పటికీ గెలుపుపై రకరకాల ఊహాగానాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్లును బట్టి అంచనాలు వేస్తున్నారు. ముఖ్యంగా ఈసారి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఓటేయడం తమకు కలిసి వచ్చే అంశమని ఇరుపార్టీలు అభ్యర్థి తరపున నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తు న్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీతోపాటు టీడీపీ, బీజేపీ, జనసేన కూడా రంగంలో నిలిచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి 81,001 ఓట్లు 48.19 శాతం రావడంతో విజయం సాధించారు. టీడీపీ అభ్యర్థి బూరుగుపల్లి శేషారావుకు 59,313 ఓట్లతో 35.29 శాతం ఓట్లు సాధించారు. జనసేన తరపున పోటీ చేసిన అతికాల రమ్యశ్రీ 23,073 ఓట్లు సాధించి 23.73 శాతం ఓట్లు పొందారు. బీజేపీ తరపున పోటీ చేసిన లింగంపల్లి వెంకటేశ్వరరావు వెయ్యి 12 ఓట్లు సాధించారు. 0.6 శాతం సాధించారు. ప్రస్తుతం ఈ మూడు పార్టీలు కలిసి ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్‌కు మద్దతు ఇచ్చాయి. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో మూడు పార్టీలకు వచ్చిన ఓట్లను కలిపితే 83 వేల 398 ఓట్లు వచ్చాయని ఈ ఓట్లు శ్రీనివాసనాయుడుకు వచ్చిన ఓట్లు కంటే 2వేల 397 ఓట్లు అధికమని అపుడే మూడు పార్టీలు కలిసి ఉంటే విజయం తమదేనని గుర్తు చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో కూడా మూడు పార్టీలు కలిసి పోటీ చేశాయని గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కలిసి వచ్చి 20 వేల వరకు ఓట్లు మెజార్టీతో తమ అభ్యర్థి గెలుస్తాడని ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకులు,కార్యకర్తలు కూడా అప్పట్లో ఉన్న తేడా స్వల్పమేనని ఈ ఐదేళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పట్ల పలువురు ఓటర్లు ఆకర్షితులు అయ్యారని పదివేల ఓట్లుకు పైగా మెజార్టీతో వైసీపీ అభ్యర్థి శ్రీనివాసనాయుడు గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా జూన్ 4న ఓట్లు లెక్కింపు జరిగే వరకు ఎవరి వాదనలు వారు వినిపిస్తూ ధీమా వ్యక్తం చేయడం తప్పదు.

కాతేరు గామన్ బ్రిడ్జి రోడ్డులో

అర్ధరాత్రి బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలు

● హిజ్రాల వేషధారణలో దందాలు

రాజమహేంద్రవరం రూరల్, మే 23: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామం శివారు గామన్ బ్రిడ్జి రోడ్డులో అర్ధరాత్రి దాటాక బ్లేడు బ్యాచ్‌ల ఆగడాలు మితిమీరుతున్నాయి. గత కొద్ది రోజులుగా కొన్ని బ్యాచ్‌లు గామన్ బ్రిడ్జి దిగువన గోదావరిగట్టు వద్దకు చేరి అర్ధరాత్రి దాటాక మద్యం మత్తులో రోడ్డుపైకి వచ్చి అటుగా వెళ్లే వాహనాలకు అడ్డంగా నిలబడి దందాలు చేస్తున్నారు. బ్లేడులు, కత్తులు, బీరు సీసాలు చేతపట్టుకుని భయానక వాతవరణాన్ని సృష్టిస్తున్నాయి. గత అర్ధరాత్రి ఈ బ్యాచ్‌లలో రెండువర్గాలకు గొడవలు జరగ్గా రోడ్డుపై రాడ్‌లతో కొట్టుకుని దారుణంగా వ్యహరించారని ఆటుగా లారీలో వెళ్లిన ఒక డ్రైవర్ తెలిపారు. లారీ ఆపి కిందకు దిగితే దాడి చేస్తారనే భయపడి ఆపకుండా వెళ్లిపోయినట్టు ఆ డ్రైవర్ చెప్పాడు. కొంతమంది యువకులు హిజ్రాల వేషధారణలో తిరుగుతున్నట్లుగా కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాతేరు గ్రామంలో మెయిన్ రోడ్డు, మల్లయ్యపేట, గణపతినగర్, ఆనంద్‌నగర్ రోడ్డు, శాంతినగర్ రోడ్డు ప్రాంతాల్లో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటాక బైక్‌లు, స్కూటీలు వేసుకుని ఇనుప రాడ్‌లు, బ్లేడ్‌లు పట్టుకుని మత్తులో తిరుగుతున్నారని వారిని ఎవరని నిలదీస్తేనే దాడి చేసేలా ఉండటంతో స్థానిక ప్రజలు కూడా బయటకు రాని పరిస్థితులు ఉన్నాయి. మత్తులో బ్లేడ్‌బ్యాచ్‌లు, హిజ్రాల వేషధారణతో కొంతమంది, బైక్‌లు దొంగతనాలు చేసేందుకు మరికొంత మంది గ్రామంలో తిరగడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి.

జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలు

● ఎటువంటి రాజకీయ పార్టీ ర్యాలీలు, సభలకు అనుమతులు లేవు

● కొవ్వూరు పట్టణ సీఐ జగదీశ్వరరావు

కొవ్వూరు, మే 23 : సాధారణ ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని ఎటువంటి ర్యాలీలు, సభలు నిర్వహించరాదని కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. ఎన్నికల కోడ్‌తోపాటు సెక్షన్ 144 సీఆర్‌పీసీ, పోలీసుల యాక్టు 30 అమలులో ఉన్నందున కొవ్వూరు నియోజకవర్గంలో గుంపులు, గుంపులుగా తిరగరాదన్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు సందర్భంగా జూన్ 4,5,6 తేదీలలో ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్పులు, పబ్లిక్ మీటింగ్‌లు, బహిరంగ సమావేశాలు, సభలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ఉద్దేశ పూర్వకంగా ప్రత్యర్థి పార్టీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో వదంతులను ప్రచారం చేయడం నేరం. అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని రాజకీయపార్టీలు ముందుగా చెప్పినట్లు మీమీ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, అందరూ హింసాత్మక చర్యలకు పాల్పడకుండా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వారికి సహకరించాలన్నారు.

ఇద్దరు పేకాటరాయుళ్లు అరెస్టు

కొవ్వూరు, మే 23 : ఇద్దరు పేకాటరాయుళ్లను అరెస్టుచేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని దండకుంట రేవు సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారంతో సీఐ గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ. 3500లు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామన్నారు.

రైల్వే కోచ్ రెస్టారెంట్.. ఇంత నిర్లక్ష్యమా!

● అగ్ని ప్రమాదం జరిగితే బూడిదే

● భద్రత గాలికొదిలేశారు..

● కాంట్రాక్టరు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంపై ప్రయాణికులు మండిపాటు


వంటల కోసం కోచ్ బయట ఉంచిన గ్యాస్ సిలిండర్లు

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వేస్టేషను ప్రాంగణంలో ఉన్న రైల్వే కోచ్ రెస్టారెంట్‌లో భద్రత గాలికొదిలేశారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఈ రెస్టారెంట్‌కి ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. పరిస్థితులు చూస్తే మాత్రం అగ్ని ప్రమాదం జరిగితే బూడిద మిగిలే విధంగా ఉంది. వంటల కోసం కోచ్ బయట గ్యాస్ సిలిండర్లను ఉంచారు. ఇవి ప్రమాదాన్ని ఆహ్వానించే విధంగా ఉన్నాయి. గ్యాస్ సిలిండర్లను వేడి నీళ్లలో పెట్టడం, వాల్చడం, భూమికి సమాంతరంగా ఉంచడం చేయకూడదు. అలాగే నిండు సిలిండర్లను ఒకేచోట ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉంచకూడదు. సిలిండర్లకు ఎండ తగలకుండా ఏర్పాట్లు ఉండాలి. కానీ ఇక్కడ వాటన్నింటినీ ఉల్లంఘిస్తున్నారు. మొత్తం రెండుచోట్ల సిలిండర్లను ఉంచగా.. ఒక చోట సిలిండర్లను వేడి నీటిలో పెడుతున్నారు. అక్కడికి దగ్గరగా మరో చోట 4 నిండు సిలిండర్లను ఒకేచోట ఉంచారు. దీనివల్ల ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే నష్టం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. రైలు కోచ్ రెస్టారెంట్ లోపల, బయట పెయింట్, లోపల సోఫాలు, అలంకరణకు వాడిన ప్లైవుడ్.. ఇలా అన్నీ మంటలు క్షణాల్లో వ్యాప్తి చెందేలా చేస్తాయి. పైగా ఈ కోచ్ లోపల ఇరుకుగా ఉండడమే కాకుండా బయటకు రావడానికి ఒకే చిన్నపాటి ద్వారం ఉంది. రాత్రి వేళల్లో ఈ రెస్టారెంట్ రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ రెస్టారెంట్‌లో కనీసం అగ్నిమాపక ఏర్పాట్లు లేకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం అగ్నిమాపక సిలిండర్లు కూడా లేవు. ఇటీవలే అధికారులు పలు అంశాల ఉల్లంఘనలపై రూ.60వేలు జరిమానా విధించారు. అయితే అత్యంత ప్రమాదకరమైన అంశాలను సంబంధిత విభాగాల అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వినవస్తున్నాయి. తనిఖీల్లో డొల్లతనం రుజువు అవుతోంది. రైల్వే అంటే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుందని, తమ పరిధిలోకి రాదని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆ ప్రాంతం రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు నిషేధితంగా భావిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వ చట్టాలను కూడా అనుసరించాలని, నిబంధన లను పాటించాలని రైల్వే ఒప్పందాల్లో ఉండడం గమనార్హం.

గుర్తు తెలియని మహిళ మృతి

నిడదవోలు, మే 23 : నిడదవోలు చాగల్లు రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం రాత్రి సుమారు 55నుంచి 60 సంత్సరాల వయస్సుగల వృద్ధురాలు మృతదేహాన్ని గుర్తించామని తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు.దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని మహిళ మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు.సమాచారం తెలిస్తే 9490617090, 7013360296ను సంప్రదించాలని ఆయన కోరారు.

సారాతో ఒకరి అరెస్టు

దేవరపల్లి, మే 23: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో జరిగిన దాడుల్లో దేవరపల్లి మండలం యాదవోలు గ్రామంలో 20లీటర్ల నాటుసారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేశా రు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఈబీ సీఐ కేవీ.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుధీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ముప్పిడి, అల్లూరి విక్రమాదిత్య

జీవీ కుటుంబానికి ముప్పిడి పరామర్శ

తాళ్ళపూడి, మే 23: తాళ్ళపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు జీవీ ప్రసాద్ తండ్రి వెంకటేశ్వరరావు ఇటీవల మర ణించారు. కొవ్వూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు అల్లూరి విక్రమాదిత్యలు జీవీ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొఠారు వెంకట్రావు, కొప్పాక విజయ్‌కుమార్, ముళ్లపూడి రామచంద్రం, గద్దే లక్ష్మణ్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఆర్ట్స్ కళాశాల రికార్డు

రాజమహేంద్రవరం అర్బన్, మే 23 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాల్లో సరికొత్త రికార్డు సాధించిందని, పరీక్షలు పూర్తయిన పది రోజులకే ఫలితాలను ప్రకటించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ఈ మేరకు గురువారం జోన్-1, 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.శోభారాణి ఈ ఫలితాలను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ ఫైనలియర్‌లో 90.7 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. అధ్యాపక సిబ్బంది కృషితో అద్భుత విజయం సాధ్యమైందన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభించనున్న వినూత్న సింగిల్ మేజర్, సర్టిఫికెట్ కోర్సులపై ఆర్‌జేడీ శోభారాణి సమీక్షించారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ సమన్వయకర్త డి.సంజీవ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త ఏ.అన్నపూర్ణ, పరీక్షల నియంత్రణాధికారి పి.బాబ్జీ, ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటర్ సీహెచ్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల షెడ్యుల్ వాయిదా

కలెక్టరేట్(కాకినాడ), మే 23: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో శుక్రవారం, శనివారం జరగాల్సిన ప్రవేశాల కౌన్సిలింగ్ తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆ సంస్థ జిల్లా సమన్వయ అధికారి వెల్లడించారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం సరికాదు

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వైరాల

రాజమహేంద్రవరం సిటీ, మే23 : ప్రైవేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలుపుదల సరికాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వైరాల అప్పారావు అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాల యం ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేట్ ఆసుపత్రులు యాజమాన్యాలు కలిసి పేదల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ సేవలందక ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద ఏ ఒక్కరు మరణించినా తీవ్రపరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ బిల్లులను ఆసుపత్రులకు చెల్లించి సేవలు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, బాబు రాజేంద్రప్రసాద్, న్యాయవాది మర్రి బాబ్జి, తుమ్మల తాతారావు, కండవల్లి లక్ష్మి, డాన్ సూరి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వోల పడిగాపులు

పోలింగ్ ఖర్చు ఇన్నాళ్లకు..

వీఆర్వోలకు సొమ్ములు అందజేసిన తహశీల్దార్

గోపాలపురం, మే 23: సాధారణ ఎన్నికల నిర్వహణకు ఈ నెల 13న నియోజకవర్గంలోని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసే బాధ్యతను స్థానిక వీఆర్వోలకు అప్పగించారు. అయితే పోలింగ్‌బూత్ ప్రదేశంలో ఓటు వినియోగించుకోవడం కోసం వచ్చే వారి కోసం చలువ పందిళ్లు, తాగునీటితో పాటు ఎన్నికల సిబ్బందికి ఆల్పాహారం, విద్యుత్ సౌకర్యం తదితర ఏర్పాట్లకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి రూ.8వేలు ఖర్చు నిమిత్తం ఇస్తామని జిల్లా కలెక్టర్ కే.మాధవీలత ప్రకటించినట్టు వీఆర్వోలు తెలిపారు. అయితే ఎన్నికల ముందు రోజు ఏర్పాట్ల నిమిత్తం మొదటి విడత ఒక్కో పోలింగ్ కేంద్రానికి రూ.3వేలు ఇచ్చినట్టు తెలిపారు. ఎన్నికలు ముగిసి పక్షం రోజులు కావొస్తున్న నేటికి మిగిలిన రూ.5 వేలు ఇవ్వకపోవడంతో గత మూడు రోజులుగా నియోజకవర్గ పరిధిలోని వీఆర్వోలు గోపాలపురం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.. గురువారం మరోసారి వీఆర్వోలు ఆ సొమ్ముల కోసం ఉదయం నుంచి కార్యాలయం బయట పడిగాపులు కాశారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు చేరింది. దీంతో స్పందించిన కలెక్టర్ తక్షణం మిగిలిని రూ.5వేలు వీఆర్వోలకు ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో సమస్య కొలిక్కివచ్చింది. ఉన్నతాధికారుల జోక్యంతో గోపాలపురం తహశీల్దార్ వనజాక్షి వీఆర్వోలకు ఆ సొమ్మును తక్షణం అందించారు.

పాపం కోసం గొడవ.. ఆరుగురిపై కేసు

కొవ్వూరు, మే 23 : వ్యక్తిపై దాడిచేసి గాయపర్చిన సంఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణానికి చెందిన జాగారపు వీరబాబు మనుమరాలు లక్ష్మీశ్రీదేవికి ఏడిదకు చెందిన వసంత్‌తో వివాహం జరిగింది. వారికి ఒక పాప పుట్టింది. ఇటీవల ఇద్దరు ఘర్షణపడి విడిపోయారు. సంవత్సరం వయస్సున్న పాప తండ్రి వద్ద ఉండిపోయింది. పాప కోసం ఇరు కుటుంబాలు కొవ్వూరు పట్టణంలో ఈనెల 22వ తేదీన వారి న్యాయవాది వద్ద చర్చలకు వచ్చారు. ఈ సందర్భంలో వీరబాబును వసంత్, అతని తరఫు వ్యక్తులు ఆరుగురు కలిసి రాయితో కొట్టి గాయపర్చారు. గాయపడిన వీరబాబును రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు వీరబాబు ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ బాబూరావు తెలిపారు.

విద్యార్థులకు సత్కారం


విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న అనాలయో

ఉండ్రాజవరం, మే 23 : విద్యార్థులకు బౌద్ధ దమ్మ పీఠం ద్వారా విద్యకు తమవంతు సహకారం అందిస్తున్నట్లు ఉండ్రాజవరం బౌద్ధదమ్మపీఠం అధిపతి బంతి అనాలయో పేర్కొన్నారు. గురువారం స్థానిక పీఠంలో ఇటీవల ఉచితంగా నిర్వహించిన పాలిటెక్నిక్ కోచింగ్ ద్వారా మంచిమార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను మెమొంటోలతో పీఠం తరపున సత్కరించారు. ఈ సందర్భంగా అనాలయో మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో మరింత ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని కోరారు. అదేవిధంగా ఇదే వేదికపై మండల యూటీఎఫ్ పదో తరగతిలో మండలస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందజేశారు. ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బూరుగులపల్లి సుబ్బారావు, మల్లిన శ్రీనివాసరావు, కోమట్లపల్లి సుబ్బారావు, మల్లిన సత్యనారాయణ, కళారావు, రామేశ్వరరావు, మల్లిన రాజేంద్రప్రసాద్, ఆళ్ల సుబ్బారావు, మద్దిపాటి శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు కె.వెంకటరత్నం, బి.రామారావు, ఐ. రాంబాబు పాల్గొన్నారు.

విజ్ఞానం కోసం గ్రంథాలయాలు అవసరం


చాగల్లు శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చిన్నారులు

చాగల్లు, మే 23: స్థానిక శాఖాగ్రంథాలయంలో గురు వారం జరిగిన వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు నీతి కథలు, సమకాలీన విషయాలపై జీకే క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెత్సా గంగాధరం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటవిడుపుగా చదరంగం, క్యారంస్ ఆడించా రు. విద్యార్థులు, యువత సహా అన్నివర్గాల వారు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా ఆయన కోరారు.

విద్యార్థులకు వేసవి ప్రత్యేక తరగతులు

పెరవలి, మే 23: వేసవి ప్రత్యేక తరగతుల్లో భాగంగా ముక్కామల, పెరవలి గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీతికథలు చెప్పడం, ఆటలు ఆడించడం, వారికి ఇష్టమైన కథల పుస్తకాలు చదివించడం నిర్వహించారు. ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో కె.విశ్వనాథం, కె.కామేశ్వరరావు, ఎ.భవాని, మదులీలా, గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు, తీపర్రులో గ్రంథాలయాధికారి జయలక్ష్మి పాల్గొన్నారు.

కొవ్వూరు ఏబీఎన్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

● ఐడీఎఫ్‌సీకి 15 మంది విద్యార్థుల ఎంపిక


గ్రూప్ డిస్కషన్స్ నిర్వహిస్తున్న ఐడీఎఫ్‌సీ ప్రతినిధులు

కొవ్వూరు, మే 23 : విద్యార్థులకు చదువుతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఏబీఎన్, పీఆర్‌ఆర్ కళాశాల ప్రముఖపాత్ర వహిస్తుందని కళాశాల ప్రిన్సిపా ల్ నందిగం వెంకటసుబ్బారావు అన్నారు. గురువారం కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాలలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ భారత్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు రీజనల్ హెచ్‌ఆర్ కొల్లూరు నవీన్‌కుమార్, బిజినెస్ క్లస్టర్ మేనేజర్ ఎం.వెంకటశివరావులు (క్యాంప స్ ఇంటర్వ్యూలు) ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. నవీన్‌కుమార్ మాట్లాడు తూ తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలో పనిచేసేందుకు అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. గ్రూప్ రిలేషన్ షిప్ మేనేజర్ ఉద్యోగాలకు సంబంధించి గ్రూపు డిస్కషన్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ. 1,80,000లు వేతనం, అద నంగా భోజన, వసతి, ప్రావిడెంటు ఫండ్ (పిఎఫ్), ఈఎస్ఐ సదుపాయాలు కల్పిస్తామన్నారు. కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి కోడూరి సూరిబాబు మాట్లాడుతూ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న, విద్య పూర్తిచేసిన వారు మొత్తం 51 మంది విద్యార్థులు హాజరుకాగా, ఏబీఎన్ కళాశాల నుంచి 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.వై.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.